RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 20 సెప్టెంబర్ 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:97




ప్రస్తుత ప్రభుత్వ వ్యవస్థ విద్యార్థుల ఆలోచనా విధానాన్ని భయపడుతోందని, ప్రశ్నించే తత్వాన్ని అణచివేయాలని చూస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన 'విద్యార్థుల గళం' కార్యక్రమంలో రాహుల్ గాంధీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఇండోర్, సెప్టెంబర్ 19: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' (విద్యార్థుల గళం) కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత ప్రభుత్వ వ్యవస్థ విద్యార్థుల ఆలోచనా విధానాన్ని భయపడుతోందని, ప్రశ్నించే తత్వాన్ని అణచివేయాలని చూస్తోందని ఆయన ఆరోపించారు.

విద్యార్థి ఎల్లప్పుడూ కొత్త విషయాలను తెలుసుకోవాలని, ప్రశ్నించాలని కోరుకుంటాడు. అందుకే వ్యవస్థకు విద్యార్థులంటే భయం. వ్యవస్థకు ప్రశ్నించే విద్యార్థులు వద్దు, చెప్పినదల్లా గుడ్డిగా నమ్మే 'అంధభక్తులే' కావాలని రాహుల్ విమర్శించారు.

న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలు తమ పనితీరును ఎందుకు సరిగ్గా నిర్వహించడం లేదో విద్యార్థులే ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. దేశంలో వరుసగా జరుగుతున్న పేపర్ లీక్‌లు, విద్యాసంస్థల దుస్థితి, నిరుద్యోగంపై యువత గళం విప్పాలని రాహుల్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు కూడా వేదికపై తమ సమస్యలను పంచుకున్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సదుపాయాల లేమి, ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు, పేపర్ లీకేజీలు, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారంటూ విద్యార్థులు రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువచ్చారు.

# విద్యార్థులకు మరింత

## ఆకర్షనీయమైన రంగుల్లో యూనిఫాం

### వచ్చే ఏడాదికి ఇప్పటి నుంచే ప్రణాళిక

### ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్: విద్యార్థులకు అందించే యూనిఫాం మరింత ఆకర్షనీయమైన రంగుల్లో ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. డిజైన్లలో వైవిధ్యానికి ప్రయత్నించాలని సీఎం అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందించే యూనిఫాం, ఇతర సామగ్రి పంపిణీపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్ పిల్లలకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందని, రెండో జత యూనిఫాంను నెలాఖరులోగా అందజేస్తామని సీఎం రేవంత్ రెడ్డికి అధికారులు తెలియజేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు పంపిణీ పూర్తయిందన్నారు. ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు, కప్పులు, కార్పెట్లు, బెడ్ షీట్లు, టవళ్లు పంపిణీ పూర్తయిందని సీఎంకు అధికారులు వివరించారు.

వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాం, ఇతర సామగ్రి విద్యార్థులకు అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అదనంగా 10 శాతం విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉన్నందున, అందుకు తగినట్లు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఈ ఏడాది అందించిన యూనిఫాం, ఇతర సామగ్రి నాణ్యతపై తల్లిదండ్రుల నుంచి సంతృప్తి వ్యక్తమైందని సీఎం అన్నారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు సబ్యసాచి ఘోష్, బాల మాయాదేవి, అహ్మద్ నదీమ్, దివ్య దేవరాజన్, నవీన్ నికోలస్, శ్రుతి ఓజా, సైదులు, సంతోష్ ,సీతా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అనర్హత తీర్పుపై.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన

### దానం నాగేందర్

వార్తా 2 లో

## రాజీవ్ రహదారిపై ప్రమాద బాధితులను ఆదుకున్నబండి సంజయ్



కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ మానవత్వాన్ని చాటుకున్నారు. మార్గమధ్యంలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని గమనించిన ఆయన, వెంటనే తన కాన్వాయ్‌ను నిలిపివేసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రమాదానికి గురైన బాధితులను తన భద్రతా వాహనంలోనే ఆసుపత్రికి తరలించి అండగా నిలిచారు.

శనివారం సిద్దిపేట నుంచి గజ్వేల్ వైపు వెళుతున్న ఒక కారు రాజీవ్ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదం సమయంలో ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో కారు నడుపుతున్న వ్యక్తి, ముందు సీటులో ఉన్న ఆయన భార్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయితే, వెనుక సీటులో కూర్చున్న వారి కుమార్తెకు తల, ముక్కు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి.

అదే సమయంలో సిరిసిల్ల వైపు వెళుతున్న బండి సంజయ్ ఈ ప్రమాదాన్ని గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపి, భద్రతా సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో చిక్కుకున్న బాధితులను బయటకు తీయడంలో స్వయంగా సహాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన బాలికను, ఆమె తల్లిదండ్రులను వెంటనే తన కాన్వాయ్‌లోని భద్రతా వాహనంలో ఆసుపత్రికి తరలించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. ఆపదలో ఉన్నవారిని సకాలంలో ఆదుకున్న బండి సంజయ్ చొరవను పలువురు అభినందించారు.

# 22ఎ సమస్యలకు త్వరలో ముగింపు

### 12 అంశాలలో ఇప్పటికే 2 అంశాలకు జీవో జారీ

### మరికొన్ని అంశాలపై తీపికబురు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ :- రాష్ట్రంలో భూసమస్యల పరిష్కారానికముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిశాసనసభలో చేసిన ప్రకటన మేరకు త్వరలో ప్రజలకు తీపికబురు అందుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. దీనిలో భాగంగా అసెంబ్లీలో ప్రకటించిన 12 అంశాలపై దృష్టి సారించి దశల వారీగా వాటిని నెరవేరుస్తున్నామని ఈ మేరకు కాలనీల సమస్యపై జీవో 118, సింగరేణి ప్రాంతంలో ఇళ్ల స్దలాల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన జీవో 76 ను విడుదల చేశామన్నారు.



ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని 44 కాలనీల్లో ఇళ్ల క్రమబద్దీకరణకు సంబంధించి సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ధృవ పత్రాలను సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఇతర ప్రజాప్రతినిధులతో కలసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లబ్దిదారులకు అందజేశారు.

మిగతా 2 లో

## జన్వాడలోని కేటీఆర్ ఫామ్‌హౌస్ వద్ద ఉద్రిక్తత

### ప్రజాభవన్ నుంచి అక్కడకు బయలుదేరిన కాంగ్రెస్ నేతలు

### భూములను ఆక్రమించారంటూ కాంగ్రెస్ నేతల ఆరోపణ

**రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం జన్వాడలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సంబంధించినదిగా చెబుతున్న జన్వాడ ఫామ్‌హౌస్, ఆ పరిసర ప్రాంతాల్లోని భూముల కేటాయింపులపై నిజానిజాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కాంగ్రెస్ ఎంపీలు, ముఖ్య నాయకులు ప్రజాభవన్ నుంచి అక్కడికి బయలుదేరారు. బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుల కుటుంబాలు నిబంధనలకు విరుద్ధంగా భూములను ఆక్రమించారనే ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ బృందం ఈ పర్యటనకు పిలుపునిచ్చింది.కాంగ్రెస్ నేతల పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం ఫామ్‌హౌస్ పరిసరాల్లో ముందస్తుగా భారీగా బలగాలను మోహరించింది. మార్గమధ్యంలో ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. మరోవైపు, జన్వాడ ఫామ్‌హౌస్ భూమి తన సొంత ఆస్తి అని, కేటీఆర్‌కు అందులో ఎటువంటి యజమాని హక్కులు లేవని, కేవలం లీజుకు మాత్రమే ఇచ్చానని యజమాని ప్రదీప్ రెడ్డి నిన్న స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

ప్రజాబలం

20 సెప్టెంబర్ 2026 ఆదివారం

# బ్రిటన్.. కర్మ రిటర్న్స్...

రవి అస్తమించని సామ్రాజ్యంగా 19వ శతాబ్దంలో ప్రపంచాన్ని శాసించిన యునైటెడ్ కింగ్‌డమ్ ఇప్పుడు నాలుగు ముక్కలు అయ్యే ముప్పును ఎదుర్కొంటోంది. స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ స్వాతంత్ర్యాన్ని సాధించుకోవడానికి సిద్ధపడుతుండటమే దీనికి కారణం.

యునైటెడ్ కింగ్‌డమ్.. యూరోప్‌లోని ఓ ప్రధాన దేశంగా, ఒకప్పుడు భారత దేశాన్ని పాలించిన దేశమని చరిత్ర చెబుతుంది. బ్రిటన్, ఇంగ్లాండ్ పేర్లు కూడా వ్యవహారంలో ఉన్నాయి. ఈ దేశానికి వేల సంవత్సరాల చరిత్ర ఉంది. అనేక ఆక్రమణలు, సామ్రాజ్యాల విస్తరణ, పారిశ్రామిక విప్లవం, ప్రజాస్వామ్య పరిణామాల సమాహారం ఇది. బ్రిటన్‌లో రాచరిక వ్యవస్థ కొనసాగుతున్నా.. ప్రపంచానికి ఆధునిక పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను పరిచయం చేసిన ఘనత బ్రిటన్‌కు ఉంది. బ్రిటన్ పార్లమెంట్‌ను "మదర్ ఆఫ్ పార్లమెంట్స్" అని పిలుస్తారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి ప్రధానమంత్రిని ఎన్నుకొని పరిపాలన కొనసాగిస్తున్నారు. చరిత్రలోకి వెళ్లి చూస్తే 80 ఏళ్ల క్రితం భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 60కిపైగా దేశాలను ఆక్రమించుకుని.. రవి అస్తమించని సామ్రాజ్యాన్ని పాలించిన ఘనత బ్రిటన్‌కు ఉంది.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అన్ని దేశాలకూ స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది. ఇప్పుడు ఓ చిన్న దేశంగా మిగిలిపోయిన యునైటెడ్ కింగ్‌డమ్‌కు కొత్త ముప్పు పొంచి ఉంది. ఒకప్పుడు రవి అస్తమించని సామ్రాన్ని నిర్మించిన బ్రిటన్ ప్రభ ఇప్పటికే సమక బారింది. 80 ఏళ్ల క్రితం భారత దేశాన్ని విభజించిన యునైటెడ్ కింగ్‌డమ్ ఇప్పుడు నాలుగు దేశాలుగా ముక్కలయ్యే పరిస్థితి ఏర్పడింది. యునైటెడ్ కింగ్‌డమ్ అంటే బ్రిటన్, స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ భాగాలు కలిసి ఉన్న సంయుక్త దేశం. కానీ ఇప్పుడు ఆ దేశాల ఐక్యతపైనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తాజా స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ ఫస్ట్ మినిస్టర్లు కార్డిఫ్ వేదికగా సమావేశమై ఇంగ్లాండ్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశాలుగా ఏర్పడటానికి అవసరమైన రెఫరెండం, భవిష్యత్ వ్యూహాలపై చర్చించారు. తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే హక్కు ప్రజలకు ఉందని స్పష్టం చేస్తూ ఓ చారిత్రక ఒప్పందంపై సంతకాలు చేశారు. అనంతరం యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి తాము విడిపోవడానికి రాజ్యాంగ ప్రక్రియను ప్రారంభించాలని ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్‌ను డిమాండు చేశారు. యునైటెడ్ కింగ్టమ్ నుంచి విడిపోయి పూర్తి స్వయం ప్రతిపత్తిగల దేశాలుగా ఉండాలని స్కాట్‌లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ దేశాలు బలంగా కోరుకుంటున్నాయి. స్వాతంత్ర్యాన్ని కోరుకునే ఫస్ట్ మినిస్టర్లు ఒకేసారి అధికారంలో ఉండటం ఇదే తొలిసారి అదే జరిగితే ఆ రాజ్యంలో ఇంగ్లాండ్ ఒకటే మిగులుతుంది. కార్డిఫ్‌లో జరిగిన సమావేశంలో స్కాట్లాండ్ ఫస్ట్ మినిస్టర్, ఎస్ఎన్‌పీ నేత జాన్ స్విన్నీ, వేల్స్ ఫస్ట్ మినిస్టర్, ప్లాయిడ్ క్రమ్రీ పార్టీ చీఫ్ రూన్ ఆప్ ఇయర్వర్త్, నార్తర్న్ ఐర్లాండ్ ఫస్ట్ మినిస్టర్, సిన్ ఫెయిన్ పార్టీ నేత మిషెల్ పాల్గొన్నారు. వీరు సంతకం చేసిన ఈ అగ్రిమెంటులోని అత్యంత కీలకమైన అంశం స్వయం నిర్ణయాధికారం. వెస్ట్ మినిస్టర్‌గా పిలిచే బ్రిటన్ పార్లమెంట్, ప్రభుత్వానికి కాలం చెల్లిపోయిందనడానికి ఇంతకు మించిన సంకేతం లేదని ఒప్పందంలో పేర్కొన్నారు.. రాజ్యాంగ మార్పునకు సిద్ధంగా ఉండాలని, తమ భవిష్యత్ యూరోప్ యూనియన్‌తో ముడిపడి ఉందని వీరు ఆండీ బర్న్‌హామ్ ప్రభుత్వానికి తెలియజేశారు. తమ సంస్కృతులను కాపాడుకునేలా సొంత నిర్ణయాలు తామే తీసుకోవాలని స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ ప్రజలు భావిస్తున్నారని నేతలు చెబుతున్నారు. ముఖ్యంగా స్కాట్లాండ్‌లో స్వతంత్ర దేశంగా మారాలనే ఉద్యమం అత్యంత బలంగా ఉంది. ముఖ్యంగా స్కాటిష్ నేషనల్ పార్టీ ఈ డిమాండ్ చేస్తోంది. వాస్తవానికి 2014లో స్వాతంత్ర్యంపై ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. అప్పుడు 55% మంది ఐఐలోనే కొనసాగాలని, 45% మంది స్వాతంత్ర్యానికి అనుకూలంగా ఓటేశారు. దీంతో స్కాట్లాండ్ స్వాతంత్ర్య ప్రయత్నం అప్పట్లో విఫలమైంది. అయితే బ్రెగ్జిట్ తర్వాత పరిస్థితులు మారాయని ఎస్ఎన్‌పీ వాదిస్తోంది. స్కాట్లాండ్ ప్రజలు ఈయూలోనే ఉండాలని అనుకుంటున్నారని, ఈయూ నుంచి బ్రిటన్ బయటకు రావడం వారికి నచ్చలేదని, అలాగే తమ ప్రాంతంలోని చమురు సంపదపై నిర్ణయాధికారం తమకే ఉండాలనుకుంటున్నారని చెబుతున్నారు. స్కాటిష్ నేషనల్ పార్టీ మరోసారి స్వాతంత్ర్యంపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది. ఇక ఉత్తర ఐర్లాండ్ విషయానికొస్తే.. అక్కడి ప్రజల్లో చాలామంది పక్కనే ఉన్న రిపబ్లిక్ ఆఫ్ ఐర్లాండ్ దేశంతో కలిసిపోవాలని కోరుకుంటున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్ పాలన నుంచి వేరుపడి, గతంలో తమకున్న గుర్తింపును తిరిగి పొందాలని కోరుకుంటున్నారు. బ్రెగ్జిట్ కారణంగా వాణిజ్యపరంగా నష్టపోతున్నామని అనుకుంటున్నారు. ఇక తమ చట్టాలను తామే చేసుకోవాలని, తమకంటూ ప్రత్యేకమైన భాష, సంస్కృతిని కాపాడుకోవాలని వేల్స్ ప్రజలు ఆశిస్తున్నారని అంటున్నారు. అయితే ఈ మూడు ప్రాంతాల ఫస్ట్ మినిస్టర్ల డిమాండ్లను ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్ పెద్దగా పట్టించుకున్నట్లుగా కనిపించలేదు. ఈ హెచ్చరికను ప్రధాని పక్కనబెట్టారని, రాజ్యాంగ చర్చల కంటే జీవన వ్యయాన్ని తగ్గించడానికి సంబంధించిన చర్యలకే ఆయన ప్రాధాన్యమిస్తున్నారని ఆండీ బర్న్‌హామ్ కార్యాలయం స్పష్టం చేసింది. విభజనకు బదులుగా ఉమ్మడి విలువలకు కట్టుబడి, సమస్య పరిష్కారానికి ప్రజలు కలిసి వచ్చినప్పుడే యూకే అత్యుత్తమంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్యం, విభజన వంటి రాజ్యాంగ అంశాల కంటే ప్రజల రోజువారీ ఆర్థిక సమస్యలకే ఆండీ బర్న్‌హామ్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ప్రస్తుతం 3దేశాల మధ్య కుదిరిన ఒప్పందానికి తక్షణ చట్టపరమైన బలం లేదు. దీంతో స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ వెంటనే బ్రిటన్ నుంచి విడిపోయే పరిస్థితి లేదు. అయితే రాజకీయంగా మాత్రం దీని ప్రభావం భారీగానే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మూడు ప్రాంతాల లక్ష్యాలు, రాజకీయ వ్యూహాలు ఒకేలా లేకపోవడంతో తక్షణమే యునైటెడ్ కింగ్‌డమ్ విచ్ఛిన్నమవుతుందని చెప్పలేం. కానీ బ్రిటన్ రాజకీయాల్లో ఐక్యతపై ప్రశ్నలు మరోసారి ప్రధాన రాజకీయ అజెండాగా మారుతున్నాయి. ఇప్పటివరకు బ్రిటన్‌ను ఒకే దేశంగా నిలబెట్టిన రాజకీయ వ్యవస్థకు ఈ కూటమి పెద్ద సవాల్‌గా మారనుంది. మొత్తం మీద భవిష్యత్తులో "యునైటెడ్ కింగ్‌డమ్" కలిసి ఉంటుందా? లేక బ్రిటన్‌తో ఒక్కొక్క దేశం బ్రేకప్ చెప్తుందా అనే దానికి కాలమే సమాధానం చెప్పనుంది. కాగా ఇటీవల ఇటీవల రిపబ్లిక్ ఆఫ్ ఐర్లాండ్ పర్యటనకు వెళ్లిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. తాను అవి సంయుక్త ఐర్లాండ్‌ను చూడాలని కోరుకుంటున్నట్లు ప్రకటించారు. అది ఎప్పటికైనా జరగాల్సిందే.. ఇప్పుడే జరిగితే మంచిదంటూ ఎప్పటి నుంచో ఉన్న వివాదాస్పద అంశాన్ని ప్రస్తావించారు. ట్రంప్ వ్యాఖ్యలు చేసిన 48 గంటల్లోనే అవగాహన ఒప్పందంపై మూడు దేశాలు సంతకాలు చేయడం గమనార్హం. 1922లో బ్రిటన్ నుంచి ఐర్లాండ్ స్వాతంత్ర్యం పొందింది. అయితే ఉత్తర ఐర్లాండ్ మాత్రం యూకేలో ఉండిపోయింది. మరొక భాగం రిపబ్లిక్ ఆఫ్ ఐర్లాండ్ స్వతంత్ర దేశంగా మారింది.

# 22ఎ సమస్యలకు త్వరలో ముగింపు

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు ఈ క్యూర్ ప్రాంతాన్ని ప్రపంచంలోనే నెంబర్ 1 ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతు సమస్యల పరిష్కారానికి గాను ఆధార్ వలే భూధార్ కార్డులు ఇస్తామని, ఈ క్యూర్ ప్రాంతంలో కూడా ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు. ప్రతిపక్షాల ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వలేమని తమకు ప్రజాసేవే ముఖ్యమని అన్నారు. ఇటీవల శాసనసభలో భూ సమస్యలపై సుదీర్ఘంగా చెప్పామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు, 12 అంశాల మేరకు ఈ సరూర్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న 64 కాలనీల్లోని 44 కాలనీల సమస్యను పరిష్కరించామని తెలిపారు.

మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ ప్రజలకు 118 జీఓ అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని ఈరోజు నిలబెట్టుకున్నామన్నారు

ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏ పార్టీవారు ప్రాతినిధ్యం వహిస్తున్నా తాము బేషజాలకు పోకుండా ఇక్కడి 44 కాలనీల సమస్యలపై కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం నుంచి నిషేధిత ఉత్తర్వులున్నా ఇప్పుడు వాటిని నెలరోజులలోగా పరిష్కరించి ఇళ్లను రెగ్యులరైజ్ చేస్తామని, ఎవరి ఇళ్లుకూల్చదని స్పష్టం చేశారు. జీవో 118 సహకారంతో మేడ్చల్ , రంగారెడ్డి జిల్లాలోని మరికొంత మందికి కూడా నెలలోగా సమస్య పరిష్కరిస్తామని ప్రకటించారు. ఈ ప్రాంత కాలనీలు చాలా కాలం నుంచి 22ఎలో ఉన్నాయని వివరిస్తూ 22ఎ కు సంబంధించి త్వరలో ఈ ప్రభుత్వం తీపి కబురు చెప్పనుందని తెలిపారు. 22ఎ అనేది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి అమలులో ఉందని, దీనిని పరిశీలించుకోవచ్చునన్నారు. అయితే కొంతమంది దీనిని అసరాగా చేసుకొని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.



మరో వారం రోజుల్లో సమస్య పరిష్కరించే విధంగా ప్రభుత్వ ఆదేశాలు రానున్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలో రిజిస్ట్రేషన్ సమస్య, దరఖాస్తు చేసుకోని వారి సమస్యను పరిష్కరించేందుకు ఈ వేదికగా ఆదేశాలు ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో ఈ మేరకు శుభవార్త చెబుతారని ప్రకటించారు.

సింగరేణి ప్రాంతంలో ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన జీవో 76 ను అమలు చేయబోతున్నామని దీనికోసం ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. మరో 45 రోజుల్లో పూర్తిస్థాయిలో భూసమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎల్. బి. నగర్, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు డి .సుధీర్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, ఎల్. బి. నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మధు యాష్కీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వంటగ్యాస్ సబ్సిడీకి బయోమెట్రిక్ తప్పనిసరి.. అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్!

**వంటగ్యాస్ సబ్సిడీకి బయోమెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణ తప్పనిసరి**

**2026 అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధన అమల్లోకి రానుంది**

**బయోమెట్రిక్ పూర్తి చేయని వారికి మార్కెట్ ధరకే సిలిండర్ సరఫరా**

**అక్రమాలను అరికట్టేందుకే ఈ నిర్ణయమన్న కేంద్ర ప్రభుత్వం**

**ఇప్పటికే 90 శాతం మంది వినియోగదారులు బయోమెట్రిక్ పూర్తి చేశారు**

దేశీయ వంటగ్యాస్ (ఎల్పీజీ) వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. రాయితీ ధరపై వంటగ్యాస్ సిలిండర్లను పొందేందుకు 2026 అక్టోబర్ 1 నాటికి బయోమెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణ (బీఏఏ) ప్రక్రియను పూర్తి చేయడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అర్హులైన కుటుంబాలకు మాత్రమే సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడటంతో పాటు, గృహ అవసరాల సిలిండర్లు వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు అక్రమంగా మళ్లకుండా నిరోధించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం వెల్లడించింది. ఆధార్‌తో బయోమెట్రిక్ అనుసంధానం చేయడం ద్వారా డూప్లికేట్, అనర్హమైన కనెక్షన్లను సులభంగా గుర్తించి తొలగించే అవకాశం ఉంటుందని పేర్కొంది. వినియోగదారులు వివిధ మార్గాల్లో ఈ బయోమెట్రిక్ ప్రక్రియను పూర్తి చేసే సౌలభ్యం ఉంది. సిలిండర్ డెలివరీ చేసే సమయంలో సిబ్బంది వద్ద ఉండే మొబైల్ యాప్ ద్వారా, లేదా నేరుగా సమీపంలోని గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కార్యాలయాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. వీటితో పాటు సంబంధిత ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల అధికారిక మొబైల్ యాప్‌ల (ఇండేన్‌కు ఇండియన్‌ఆయిల్ వన్, భారత్‌గ్యాస్‌కు హలోబీపీసీఎల్, హెచ్‌పీ గ్యాస్‌కు హెచ్‌పీ పే) ద్వారా కూడా వినియోగదారులు స్వయంగా ప్రామాణీకరణ చేసుకోవచ్చని ప్రభుత్వం సూచించింది. ఇప్పటికే బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి చేసిన వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయని పక్షంలో సబ్సిడీ వర్తించదు. అటువంటి వారు సిలిండర్‌ను మార్కెట్ ధరకే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 19 నాటికి దేశవ్యాప్తంగా దాదాపు 90 శాతం మంది, అంటే 27.43 కోట్ల మంది వినియోగదారులు ఇప్పటికే బయోమెట్రిక్ ప్రామాణీకరణను పూర్తి చేశారని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండర్‌పై సుమారు రూ. 210 వరకు రాయితీ లభిస్తోంది. కేవలం అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఈ ప్రయోజనం చేకూరేలా చూడటం ప్రభుత్వ ఆర్థిక సుస్థిరతకు అత్యవసరమని కేంద్ర ప్రభుత్వం తన ప్రకటనలో పేర్కొంది.




## అనర్హత తీర్పుపై.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్




ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. శనివారం మధ్యాహ్నం ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్?పీ) దాఖలు చేశారు.

బీఆర్ఎస్ తరపున గెలిచి, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై శుక్రవారం హైకోర్టు అనర్హత వేటు వేసిన విషయం విదితమే. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది.

ఈ అనర్హత 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే వర్తిస్తుందని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ గతంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించాలని, తీర్పు ప్రతులను స్పీకర్ కార్యాలయానికి, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు, ఇదే వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈఅంశంపైతమవాదనలు వినకుండా ఎలాంటిఏకపక్షనిర్ణయం తీసుకోవద్దనివారు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.

# ఢిల్లీ తెలంగాణను భవన్ లో

## మహాగణపతి పూజ కార్యక్రమంలో మహేష్ కుమార్ గౌడ్



ఢిల్లీ తెలంగాణను భవన్ లో ఏర్పాటు చేసిన మహాగణపతి పూజ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ భక్తి, శ్రద్ధలతో ఘనంగా మహాగణపతి పూజ నిర్వహించిన మహేష్ కుమార్ గౌడ్

తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలవాలని ,పాడిపంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన దిశగా ముందుకు వెళు న్నామని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు

దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్ గా ఉండాలని భగవంతుని ప్రార్థించాను.

# మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధి పనులపై మంత్రి సీతక్క సమీక్ష



ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 19 మంగపేట మంగపేట మండలంలోనిమల్లూరు క్షేత్రంలో పర్యటించి అభివృద్ధి పనుల డిజైన్ ఖరారు చేయాలని నిర్ణయం

కళ్యాణ మండపం, డార్మిటరీ, అన్నదాన సత్రం తదితర సౌకర్యాల అభివృద్ధికి చర్యలు

దేవాలయ పవిత్రతకు, ప్రస్తుత నిర్మాణానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశం

ములుగు జిల్లాలోని ప్రసిద్ధ మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క దేవాలయ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.

ఈ సమీక్ష సమావేశంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో పాటు ప్రముఖ ఆర్కిటెక్టులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ప్రస్తుత పరిస్థితి, భక్తుల రాకపోకలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

దేవాలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, మల్లూరు క్షేత్ర ప్రాశస్త్యం, చారిత్రక మరియు ఆధ్యాత్మిక ప్రాధాన్యతకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి సీతక్క సూచించారు. అభివృద్ధి పనులలో భాగంగా కళ్యాణ మండపం, డార్మిటరీ, అన్నదాన సత్రం వంటి అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు



చేయడంపై సమావేశంలో చర్చించి, వాటి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అదేవిధంగా, దేవాలయ ప్రధాన నిర్మాణానికి ఎలాంటి ఇబ్బంది లేదా డిస్టర్బెన్స్ కలగకుండా, క్షేత్ర పవిత్రతను కాపాడుతూ అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. దేవాలయ నిర్మాణ స్వరూపం, పరిసర ప్రాంతాల ప్రత్యేకత, భక్తుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆర్కిటెక్టులు, అధికారులను ఆదేశించారు.

అభివృద్ధి పనులకు సంబంధించిన డిజైన్‌ను ఖరారు చేసేందుకు త్వరలో మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి, అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించాలని సమావేశంలో నిర్ణయించారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం దేవాలయ అభివృద్ధికి అనువైన డిజైన్‌ను ఖరారు చేయనున్నారు.

అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించి భూమి స్థితిగతులు, నిర్మాణ సామర్థ్యం తదితర అంశాలను నిర్ధారించేందుకు రాక్ టెస్ట్‌ను త్వరితగతిన చేపట్టాలని నిర్ణయించారు. రాక్ టెస్ట్ నివేదిక ఆధారంగా తదుపరి నిర్మాణ పనులకు సంబంధించిన సాంకేతిక అంశాలను ఖరారు చేయనున్నారు.

మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో, సమన్వయంతో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేపట్టాలని అధికారులకు సూచించారు.

# భారీ వర్షాలు, గణేష్ నిమజ్జన శోభాయాత్ర ఏర్పాట్లపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష

## కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి

హైదరాబాద్, సెప్టెంబర్ 19: రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని టీ–జీఐసీసీసీ (కమాండ్ కంట్రోల్ సెంటర్)కు వెళ్లి రాష్ట్రంలో, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు.

భారీ వర్షాలతో పాటు నగరంలో జరగనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్రకు చేపట్టిన ఏర్పాట్లను కూడా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరిశీలించారు. గణేష్ శోభాయాత్ర ప్రారంభమయ్యే బాలాపూర్‌తో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన శోభాయాత్ర మార్గాల్లో రహదారుల పరిస్థితి, రోడ్ల మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, నీరు నిలిచే ప్రాంతాల్లో చేపట్టిన చర్యలు తదితర ఏర్పాట్లను సీఎస్ పరిశీలించారు.

టీ–జీఐసీసీసీ ఇన్‌చార్జ్ అధికారి కమల్ హాసన్ రెడ్డి సీఎస్‌కు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జరుగుతున్న రియల్‌టైమ్ పర్యవేక్షణ, వివిధ ప్రాంతాల్లో పరిస్థితులపై అందుతున్న సమాచారం, శోభాయాత్ర మార్గాల్లో చేపట్టిన నిఘా ఏర్పాట్లను వివరించారు.

శోభాయాత్ర మార్గాల్లో జజుఎ కెమెరాల ద్వారా చేపడుతున్న నిఘా, పర్యవేక్షణ



ఏర్పాట్లను కూడా సీఎస్ పరిశీలించారు. కీలకమైన ప్రాంతాలు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలు, శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో CCTV నిఘాను మరింత పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు.

భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన చోట్ల వెంటనే నీటిని తొలగించే చర్యలు చేపట్టాలని సీఎస్ సూచించారు. దెబ్బతిన్న రోడ్లకు అవసరమైన మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని, వర్షాల కారణంగా శోభాయాత్రకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

గణేష్ శోభాయాత్ర సందర్భంగా భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నిర్వహణ, విద్యుత్, వైద్య, అత్యవసర సేవలను సమన్వయంతో అందుబాటులో ఉంచాలని సీఎస్ సూచించారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పరిస్థితులను రియల్‌టైమ్‌లో నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే సంబంధిత శాఖల అధికారులు స్పందించేలా సమన్వయం చేసుకోవాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

భారీ వర్షాలు, గణేష్ నిమజ్జన శోభాయాత్ర నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన అన్ని ముందస్తు చర్యలను తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు.

# ఆపరేషన్ 2029

## తొలి అడుగు ఖమ్మం గడ్డం పైనేనా ప్రయోగశాలగా ఉమ్మడి ఖమ్మం జిల్లా






చంద్రుగొండ సెప్టెంబర్ 19 ప్రజా బలం ప్రతినిధి:–తెలంగాణ రాజకీయాల్లో ఖమ్మం జిల్లా మరోసారి హాట్ టాపిక్ మారుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ కొనసాగుతున్న సమయంలో.. కొత్త రాజకీయ శక్తులు కూడా ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నాయన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా జనసేన తెలంగాణలో ప్రత్యక్షంగా పోటీ చేయాలన్న సంకేతాలు ఇవ్వడం ఖమ్మం రాజకీయాలపై ఆసక్తిని పెంచుతోంది. 2024 ఎన్నికల సమయంలో ఏర్పడిన రాజకీయ పొత్తులు, సమీకరణాలు భవిష్యత్తు ఎన్నికల్లో యథాతథంగా కొనసాగవన్న సంకేతాలు జనసేన వైపు నుంచి రావడం గమనార్హం. తెలంగాణలో పార్టీకి స్వతంత్ర రాజకీయ గుర్తింపు తీసుకురావాలన్న ప్రయత్నంలో భాగంగా సంస్థాగతంగా బలోపేతం కావాలని జనసేన భావిస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం వేదికగా భారీ బహిరంగ సభనిర్వహించాలన్న ఆలోచనకు ప్రాధాన్యం ఏర్పడింది. ఖమ్మం జిల్లాలో పార్టీ బలాన్ని చాటడంతో పాటు.. తెలంగాణలో తమ రాజకీయ ఉనికిని స్పష్టంగా ప్రకటించేందుకు ఈ సభను ఉపయోగించుకోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. –

జగన్ చూపు కూడా ఖమ్మం పైనే?

మరోవైపు ఆంధ్రప్రదేశ్లో అధికారాన్ని కోల్పోయిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో తన రాజకీయ కార్యకలాపాలను విస్తరించే అవకాశాలపై కూడా చర్చ జరుగుతోంది. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెలంగాణలో కొంతమంది నాయకులను ముందుకు తెచ్చి రాజకీయంగా ప్రయోగాలు చేయవచ్చన్న ప్రచారం మొదలైంది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాను రాజకీయ కార్యకలాపాలకు కేంద్రంగా చేసుకునే అవకాశంపై కూడా చర్చ సాగుతోంది. అయితే వైసీపీ తెలంగాణలో ఎంతవరకు సంస్థాగతంగా విస్తరించగలదు? ఆ పార్టీకి స్థానికంగా నాయకత్వం, క్యాడర్ ఎంతమేర అందుబాటులో ఉంది? అన్నది ఇప్పటికీ కీలక ప్రశ్నగానే ఉంది.

– ఓట్ల చీలికే అసలు టార్గెట్?

కొత్త రాజకీయ పార్టీలు ఎన్నికల బరిలోకి దిగితే వాటికి గెలుపు అవకాశాల కంటే ముందుగా ఓట్ల చీలిక ప్రభావం ఎక్కువగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రత్యేకించి తక్కువ మెజారిటీతో గెలుపోటములు నిర్ణయమయ్యే నియోజకవర్గాల్లో కొత్త పార్టీకి వచ్చిన స్వల్ప ఓట్లు కూడా ఫలితాలను తారుమారు చేసే అవకాశం ఉంటుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో

ఖమ్మంలో రాజకీయ రచ్చ

ఆంధ్రప్రదేశ్ సామాజిక, కుటుంబ, వ్యాపార సంబంధాలు ఉన్న ప్రజల సంఖ్య గణనీయంగా ఉండటం కూడా ఈ రాజకీయ చర్చకు కారణంగా మారుతోంది. అయితే ఆంధ్ర మూలాల ఓటర్లు ఒకే రాజకీయ పార్టీకి లేదా ఒకే నాయకత్వానికి అనుకూలంగా ఉంటారనే అంచనా వేయడం కూడా అంత సులభం కాదు. వారి ఓటు నిర్ణయం స్థానిక అభ్యర్థి, ప్రభుత్వ పనితీరు, శ్రీ ప్రాంతీయ సమస్యలు, వ్యక్తిగత రాజకీయ సంబంధాలు తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది.

కాంగ్రెస్ నష్టమా.. బీఆర్ఎస్ దెబ్బా?

ఇక్కడే అసలు రాజకీయ లెక్కలు మొదలవుతున్నాయి. జనసేన, వైసీపీ వంటి పార్టీలు పోటీ చేస్తే అవి ఎవరికి నష్టం చేస్తాయి? అనేది ఎన్నికల సమీకరణాలను నిర్ణయించే అంశంగా మారనుంది. ఒకవేళ ఈ పార్టీలకు గతంలో కాంగ్రెస్ లేదా బిఆర్ఎస్ కు అనుకూలంగా ఉన్న ఓటర్లలో కొంత భాగం మళ్లితే.. పోటీ ఉన్న నియోజకవర్గాల్లో ఫలితాలు ప్రభావితం కావచ్చు. అయితే ఏ పార్టీకి ఎంత నష్టం జరుగుతుందనేది నియోజకవర్గాన్ని బట్టి మారుతుంది. బీఆర్ఎస్ తన సంప్రదాయ ఓటు బ్యాంకును తిరిగి సమీకరించుకునే ప్రయత్నం చేస్తుండగా.. కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ప్రభుత్వ పనితీరును ఆధారంగా చేసుకుని మరోసారి ప్రజల మద్దతు కోరాల్సి ఉంటుంది. ఈ రెండు పార్టీల మధ్య ఓట్ల శాతం స్వల్పంగా మారినా మూడో పార్టీకి వచ్చిన ఓట్లు కీలకంగా మారే అవకాశం ఉంటుంది.

– గెలుపు అంత సులభం కాదు!

అయితే కొత్త పార్టీల ప్రవేశాన్ని నేరుగా సీట్ల గెలుపుతో ముడిపెట్టడం తొందరపాటు రాజకీయ అంచనా అవుతుంది. ఎన్నికల్లో పోటీ చేయడం ఒక ఎత్తయితే... బలమైన స్థానిక నాయకత్వాన్ని ఏర్పాటు చేయడం, బూత్ స్థాయి క్యాడర్ను తయారు చేయడం, ఎన్నికల నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోవడం మరో ఎత్తు. జనసేనకు పవన్ కల్యాణ్ వ్యక్తిగత ప్రజాదరణ ఒక రాజకీయ బలం కావచ్చు. కానీ తెలంగాణలో ఆ ప్రజాదరణను నియోజకవర్గ స్థాయిలో ఓట్లుగా, ఆ ఓట్లను సీట్లుగా మార్చడం కోసం బలమైన స్థానిక నిర్మాణం అవసరం. అదే విధంగా వైసీపీకి కూడా తెలంగాణలో సంస్థాగత విస్తరణ పెద్ద సవాలే.

ఖమ్మం.. ప్రయోగశాలగా మారుతుందా?

తెలంగాణలో కొత్త రాజకీయ ప్రయోగాలకు ఖమ్మం మరోసారి ప్రయోగ శాలగా మారుతుందా? అన్నదే ఇప్పుడు ఆసక్తికర ప్రశ్న, ఒకవైపు అధికార కాంగ్రెస్ తన బలాన్ని నిలబెట్టుకోవాలని చూస్తోంది. మరోవైపు బీఆర్ఎస్ పూర్వ వైభవాన్ని తిరిగి సాధించేందుకు ప్రయత్నిస్తోంది. బీజేపీ కూడా రాష్ట్రంలో తన విస్తరణపై దృష్టి పెడుతోంది. ఈ సమయంలో జనసేన, వైసీపీ వంటి పార్టీలు ఖమ్మం జిల్లాలో తమ రాజకీయ ఉనికిని పెంచుకునే ప్రయత్నం చేస్తే పోటీ బహుముఖంగా మారే అవకాశం ఉంది. అయితే రాజకీయాల్లో ఓట్ల చీలిక ఎప్పుడూ ఒకే పార్టీకి అనుకూలంగా పని చేయదు. కొత్త పార్టీకి వచ్చే ఓట్లు ఎవరి నుంచి వస్తున్నాయి? ఏ నియోజ కవర్గంలో ఎంత శాతం వస్తున్నాయి? అభ్యర్థి ఎవరు? స్థానిక సామాజిక సమీకరణాలు ఎలా ఉన్నాయి? వంటి అంశాలపైనే అసలు ఫలితం ఆధార పడి ఉంటుంది. అందుకే ఖమ్మంలో జనసేన, వైసీపీ అడుగులు వేస్తే వెంటనే ఏ పార్టీకి నష్టం, ఏ పార్టీకి లాభం అని తేల్చడం కంటే వాటి బలం, అభ్యర్థుల ఎంపిక, బహిరంగ సభలకు స్పందన, స్థానిక నాయకుల చేరికలు, క్యాడర్ నిర్మాణం వంటి పరిణామాలను గమనించాల్సి ఉంటుంది. చివరికి.. ఖమ్మం ఓటరు ఎవరికి పట్టం కడతాడన్నది కంటే, కొత్త పార్టీలకు ఎంత స్థలం ఇస్తాడన్నదే రాబోయే రాజకీయ సమీకరణాల్లో కీలక అంశంగా మారనుంది.

ఖమ్మంలో 2014 ఫలితాలు రిపీట్ అవుతాయా

తెలంగాణ రాష్ట్రం కొత్తగా ఏర్పడిన తరుణంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రధాన పార్టీలకు జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వైరా, పినపాక,అశ్వరావుపేట, అదేవిధంగా ఖమ్మం జిల్లా ఎంపీ సీటును కూడా గెలుచుకొని, స్థానిక ఎలక్షన్లో పెద్ద మొత్తంలో సర్పంచులు,ఎంపీటీసీ, జడ్పిటిసి,లను కైవసం చేసుకుని తిరుగులేని రాజకీయ పార్టీగా అవతరించింది.. కాలక్రమేనా తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అధికారం రావడంతో తెలంగాణలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు చేరిపోవటంతో స్థానికంగా పార్టీలు నిర్వేమయ్యాయి.. కానీ అప్పటి నాయకులు వివిధ పార్టీల్లో ఉన్న సరైన గుర్తింపు లేకపోవడంతో కొత్తగా వచ్చే పార్టీల లోకి గోడ దూకడానికి సిద్ధంగా ఉన్నారు.

# మర్పల్లి మండల స్థాయి సమీక్ష సమావేశానికి హాజరైన జెడ్పి సీఈవో సుధాకర్






**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 19 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి మండల స్థాయి సమీక్ష సమావేశానికి హాజరై సమావేశంలో పాల్గొన్న జడ్పి సీఈఓ సుధాకర్ మండల స్థాయి అధికారులు వివిధ గ్రామ సర్పంచులు సెక్రటరీలు సమావేశంలో పాల్గొన్నట్టు తెలిపారు సమావేశంలో వ్యవసాయ శాఖ విద్యుత్ శాఖ విద్యాశాఖ ఆరోగ్య శాఖ పశుసంవర్ధక శాఖ గ్రామీణ మంచినీటి సరఫరా ఆర్డబ్ల్యూఎస్ స్త్రీ మరియు సంక్షేమ ఐసిడిఎస్ శాఖ వికసిత్ భారత్ గ్యారెంటీ రోజుగారి ఆ జీవికా మిషన్ గ్రామీణ శాఖ పంచాయతీరాజ్ శాఖ మండల మహిళా సమైక్య ఎం ఎం ఎస్ రోడ్డు భవనాల శాఖ హార్టికల్చర్ పట్టు పరిశ్రమ శాఖ అట్టవిశాఖ చిన్న నీటి పారుదల శాఖ రెవెన్యూ పౌరసరఫరాల శాఖ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి సాంఘిక సంక్షేమ మరియు వెనుకబడిన తరగతుల శాఖ మద్యపాన నిషేధం మరియు ఆప్కారి శాఖ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ శాఖ ఇలా అన్ని డిపార్ట్మెంట్ల వారిగా మండల స్థాయి సమీక్ష సమావేశంలో రివ్యూ నిర్వహించడం జరిగింది అని తెలిపారు ప్రభుత్వ పాఠశాలలో లాస్ట్ ఇయర్ కంటే ఈ సంవత్సరం మెరుగైన విద్య అందిస్తున్నట్టు తెలిపారు ప్రభుత్వ పాఠశాలలో లాస్ట్ ఇయర్ కంటే ఈ సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరిగిందని విద్యార్థి గారి బి అశోక్ తెలిపారు వికారాబాద్ జిల్లాలోని రెండవ స్థానంలో మన మండల విద్యార్థులు మంచిర్యాంకులో ఉన్నారని తెలిపారు వికారాబాద్ డివిజన్లో 26 డిస్మెంటల్ బిల్డింగ్స్ ఉన్నాయి మరి ముఖ్యంగా మన మండల్ లో 13 బిల్డింగ్స్ ఉన్నాయి ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటిని వెంటనే తీసేందుకు అధికారుల నివేదిక గురించి వెయిట్ చేయడం జరుగుతుందని తెలిపారు మరి ముఖ్యంగా భూచన్పల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల పూర్తిస్థాయిలో స్లాబ్ నిర్మాణం అస్తవ్యస్తంగా ఉంది వర్షం పడిందంటే పిల్లలు చాలా ఇబ్బందికరంగా విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారని గ్రామ సర్పంచి తెలిపారు ఆరోగ్యశాఖలో అక్కడక్కడ గ్రామపంచాయతీలలో ఆశ వర్కర్స్ లేరు ప్రెగ్నెన్సీ ఉన్నటువంటి వారు ఆసుపత్రికి వెళ్లే సమయాల్లో వారికి తోడుగా ఉండటానికి ప్రభుత్వం వెంటనే స్పందించి లేని గ్రామాల్లో ఆశ వర్కర్లను పూర్తి చేయాలని సర్పంచులు ఎంత డిపార్ట్మెంట్ వారికి తెలియపరచడమైనది వ్యవసాయ శాఖలో పంటలకు సంబంధించినటువంటి పూర్తిస్థాయి నమోదు చేయడం జరుగుతుంది అని తెలిపారు ఐసిడిఎస్ అంగన్వాడి టీచర్స్ ఆయాలు కొరత ఉంది మండల స్థాయిలో మరియు బిల్డింగ్స్ కొరత కూడా ఉంది ప్రభుత్వానికి నివేదిక పంపించడం వెంటనే ప్రభుత్వం నుండి ఆర్డర్ రాగానే గ్రామ పంచాయతీలలో సర్పంచ్ల ద్వారా తీర్మానాలు పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఐసిడిఎస్ వారు తెలిపారు ఇలా అన్ని డిపార్ట్మెంట్ల నుండి పూర్తిస్థాయిలో నివేదిక ను అధికారులు ప్రజెంటేషన్ చేయడం జరిగిందని తెలిపారు ముఖ్యంగా మర్పల్లి సర్పంచ్ మధుగు రామేశ్వర్ మాట్లాడుతూ రైతు గుండె నిండా బాధతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతు ఆవేదన పడుతున్నాడు కాబట్టి ప్రభుత్వ అధికారులు వ్యవసాయ శాఖ వారు ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపించి రైతుల పంటలు పూర్తిస్థాయిలో నమోదు చేయించి పంటలకు సరిపోను ప్రభుత్వం నుండి సహాయం వచ్చే విధంగా అధికారులు నివేదిక పంపించాలని ఇలా నే వర్షాలు కురవకపోతే వచ్చే సంవత్సరం అనేక సమస్యలు త్రాగడానికి నీరు లేక పశువులుపక్షులకు నీరు లేక భూగర్భ జలాలు అంతరించిపోయి ముందు ముందు చాలా రకాల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది కాబట్టి ఏపీఓ గారు చెప్పినట్టు భూగర్భ జలాలు నిల్వచేసే ప్రక్రియను కూడా వేగవంతంగా చేయాలి అని తెలిపారు ఇలా అన్ని రకాల శాఖల నుండి అది . కారులు నివేదిక సమర్పించి నట్టు తెలిపారు కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, జెడ్పి సీఈఓ సు ధాకర్, ఎంపీడీవో శాంతమ్మ, ఎమ్మార్వో మనో హార్ చక్రవర్తి, ఎం పి ఓ శ్రీనివాస్, మరియు ఆర్ డబ్ల్యు ఎస్ సార్, ఏపీవో ఏపీఎం వివిధ గ్రామాల సర్పంచులు వివిధ గ్రామాల సెక్రటరీలు కార్యక్రమంలో పాల్గొని మండల నివేదిక సమర్పించడం జరిగిందని వాటిపైచర్చించిసనుకూలంగాస్పందించి అన్ని కార్యక్రమాలుసజావుగాజరిగేటట్టు అందరు కృషి చేయాలని కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియ పరుస్తు న్నాను అని ఎంపీడీవో శాంతమ్మ తెలిపారు

# డాన్ బోస్కోలో మండల స్థాయి పాఠశాలల క్రీడలు విజయవంతంగా నిర్వహించిన ఫాదర్ ప్రదీప్





**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 19**తల్లాడ మండల స్థాయి పాఠశాలల క్రీడలు సెప్టెంబర్ 17, 18,19 మూడు రోజుల పాటు పోటా– పోటీగా పినపాక నందలి డాన్ బోస్కో పాఠశాలలో క్రీడలలో సుమారుగా 12 పాఠశాలలు పాల్గొని, క్రీడా స్ఫూర్తి తో విజయవంతంగా బహుమతుల ప్రధానంతో మరియు మంచి జ్ఞాపకాలతో ముగించారు. ఈ క్రీడలలో తల్లాడ మండల విద్యాశాఖ అధికారి ఎన్. దామోదర్ ప్రసాద్ క్రీడలకు కన్వీనర్ ఉంగరాల వెంకటేశ్వరరావు తల్లాడ ప్రధానోపాధ్యాయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె. పాపారావు సారధ్యంలో తల్లాడ మండలం పాఠశాలల క్రీడలలో భాగంగా మొదటి రోజు బాలురకు, రెండవ రోజు బాలికలకు మరియు మూడవ రోజు అథ్లెటిక్స్ క్రీడలన్నీ కూడా ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. ఈ క్రీడలలో బహుమతుల ప్రధానోత్సవం చేశారు. ఈ క్రీడల నిర్వహణను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియ చేశారు.క్రీడా పోటీల్లో తల్లాడ మండల వ్యాయామ ఉపాధ్యాయులు సెక్రెటరీ కె. పాపారావు,అన్నారుగూడెం పిడి శ్రీదేవి మేడ, కుర్నవల్లి పిడి శివ, జెడ్పిఎస్ఎస్ బిల్లుపాడు పీఈటి ఎక్కిరాల రమేష్, పినపాక పిటి ఎం. ప్రసాద్,మిట్టపల్లి మోహన్ రావు సమిష్ట సహాయ సహకారాలతో క్రీడలలను విజయవంతంగా ముగించడం జరిగింది. ఈ క్రీడలకు క్రీడావేదిక ఇచ్చిన డాన్ బోస్కో ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డికి యాజమాన్యానికి తల్లాడ మండల వ్యాయామ ఉపాధ్యాయుల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. 14 సంవత్సరాల బాలుర విభాగంలో, బాలుర వాలీబాలు మొదటి బహుమతి బాలభారతి.రెండవ బహుమతి లూర్దుమాత. 17 సంవత్సరాల బాలుర విభాగంలో,వాలీబాల్ మొదటి బహుమతి డాన్ బాస్కో రెండో బహుమతి బాలభారతి 14 సంవత్సరాల బాలుర విభాగంలో, బాయ్స్ కోకో మొదటి బహుమతి యూనివర్సల్ రెండవ బహుమతి డాన్ బోస్కో పినపాక 17 సంవత్సరాల బాలుర విభాగంలో, బాయ్స్ కోకో మొదటి బహుమతి డాన్ బోస్కో పినపాక రెండవ బహుమతి కుర్నవల్లి

జెడ్ పి హెచ్ ఎస్14 సంవత్సరాల బాలుర విభాగంలో, కబడ్డీ మొదటి బహుమతి డాన్ బోస్కో రెండవ బహుమతి యూనివర్సిల్

14 సంవత్సరాల బాలికల విభాగంలో, కబడ్డీ మొదటి బహుమతి జెడ్పిహెచ్ఎస్ కుర్నవల్లి రెండవ బహుమతి యూనివర్సిల్ 17 సంవత్సరాల వయస్సు బాలికల విభాగంలో వాలీబాల్ మొదటి బహుమతి జెడ్పిహెచ్ఎస్ కుర్నవల్లి

రెండవ బహుమతి జడ్పీహెచ్ఎస్ తల్లాడ

14 సంవత్సరాల వయస్సు లోపు విభాగంలో వాలీబాల్ మొదటి బహుమతి జడ్పీహెచ్ఎస్ కుర్నవల్లి రెండవ బహుమతి జడ్పీహెచ్ఎస్ తల్లాడ 14 సంవత్సరాల లోపు బాలికల విభాగంలో, కోకోమొదటి బహుమతి యూనివర్సిల్ రెండో బహుమతి జడ్పీహెచ్ఎస్ పినపాక గెలుచుకున్నారు.


ఓవర్ ఆల్ చాంపియన్ గా ప్రథమ స్థానంలో డాన్ బోస్కోపాఠశాల నిలిచింది. ద్వితీయ స్థాయిలో యూనివర్సల్ పాఠశాల నిలబడినది.అదేవిధంగా ఈ క్రీడలకు బహుమతుల దాత ఏమిరెడ్డి కృష్ణారెడ్డి సతీమణి పేరు మీద వారి కుమార్తెలు శీలం నాగమణి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. డాన్ బోస్కో ప్రిన్సిపల్ వై. ప్రదీప్ రెడ్డి, ఫాదర్. సునీల్, ఫాదర్. రాజేష్, ఫాదర్. చంద్రమోహన్, పీఈటీలు నరసింహారావు, గోపి, సాగర్ మరియు డాన్ బాస్కో పినపాక ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పూజల్లో పాల్గొన్న మెట్టు సాయి కుమార్ తదితరులు





**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** విఘ్నాలకు అధిపతి విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఫిషరీస్ కార్పోరేషన్ మాజీ ఛై ర్మెన్ మెట్టు సాయికుమార్ ఆకాంక్షించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ట్వికింట్ స్టార్ ఫౌండేషన్, తుల్జాభవాని యూత్ అసోసి యేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో కోఠి బడీచౌడీలో నెలకొల్పిన వినాయక మండపాన్ని ఆయన, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పి చంద్ర మో హన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి బద్ధం సతీష్ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చేతన్కుమార్లతో కలిసి సందర్శించి, గణనాథుడిని ద ర్శించుకుని, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గణేశ మండపం ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ స ందర్భంగా మెట్టు సాయికుమార్ మా ట్లాడుతూ గణేశుడి దీవెనలు సిఎం రేవంత్ రెడ్డికి మెండుగా ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభి వృద్ధి పథంలో పయనించేలా విఘ్న వి నాయకుడే సిఎం రేవంత్రెడ్డిని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. సర్వ దేవతల మొదటి పూజలందుకునే గ ౹ ణేశుడి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలు అంద రిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్వింకిల్ స్టార్ ఫౌండేషన్ ఛైర్మెన్ పి దుర్గాదేవి, మేనేజింగ్ డై రెక్టర్ ఎన్ గోపీయాదవ్, తుల్జాభవాని యూత్ అసోసియేషన్ అధ్యక్షులు ఆదర్శ్ మహేంద్రకర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** గోషామహల్ అసెంబ్లీ నియోజక వర్గంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ డివిజన్లో కేసరీ అసోసియేషన్ హిందీనగర్ కా రాజా హిందీనగర్ గోషామహల్లో గణేష్ మండాపానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన మాజీ ఎంపీ ఎం. అంజన్కూమార్ యాదవ్ , కేడిసీసీ సెక్రటరీ ఎస్. ధన్రాజ్ పాల్గోన్నారు. కేసరీ అసోసియేషన్ నిర్వాహకులు శాలువాకప్పి సన్మానించినారు. ఈ కార్యక్రమంలో కమీటీ సభ్యులు పంకజ్గుప్తా ,అక్షయ్ తంగెల్లా ,కన్కరాజు ,ఆకాష్, లక్ష్మణ్ , సందీప్ దిలికర్,రజిని తదితరులు పాల్గోన్నరు.

# అర్హులైన వారికి ఇందిరమ్మ గృహాలు ఇవ్వాలి

కమాన్పూర్, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో నిజమైన నిరుపేదలకు అన్యాయం జరుగుతోందని, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమాన్పూర్ మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గల అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించినారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు.మొదటి, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అర్హులైన నిరుపేదలకు ఇళ్లు దక్కలేదని విమర్శించారు. ఇందులో కొందరు దళారులు చేతివాటం చూపిస్తున్నారని ఆరోపించారు.రాజకీయాలకు అతీతంగా అన్ని గ్రామాల్లోని అర్హులైన నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు. . ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాడికొండ శంకర్, మాజీ ప్రజాప్రతినిధులు గుర్రం లక్ష్మీమల్లు, కొండ వెంకటేష్, ఆకుల గట్టయ్య, కొట్టే భూమయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాచకొండ రవి, జాబు సతీష్, దండే కిషన్, కొయ్యడ రవి, రాచకొండ చంద్రమౌళి,, పెండ్లి నారాయణ, ఎలబోయిన రామ్మూర్తి, నడిగట్టు సంపత్, ఆకుల రమేష్, చిప్పకుర్తి రాజ్ కుమార్, చిప్పకుర్తి శ్రీనివాస్, బోయిని బాలకృష్ణ, పంతకాని రవి, సుధాకర్, మానక ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

# ఉయ్యాలవాడ సమీపంలో వ్యక్తి దారుణ హత్య



నంద్యాల ఉయ్యాలవాడ మండలం ఆర్.పాంపల్లె గ్రామ సమీపంలో శనివారం దారుణ హత్య ఘటన చోటు చేసుకుంది. ఉయ్యాలవాడకు వచ్చే రహదారిలో రామయ్య కోనేరు సమీపంలో మోటార్ సైకిల్ పై వ్యక్తి వెళ్తున్న చింతకుంట నాగార్జున అనే వ్యక్తిని దుండగులు అడ్డగించి కళ్ళల్లో కారం కొట్టి కత్తులతో పొడిచి హత్య చేసినట్లు స్థానికులు ఆరోపించారు. సమీపంలోని పంట పొలాల్లోకి తీసుకువెళ్లి కత్తితో హత్య గావించారు. మృతదేహంపై తీవ్ర గాయాలు ఉన్నాయి. ఘటనా స్థలాన్ని ఆళ్లగడ్డ డిఎస్పి శ్రీనివాసరావు సందర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# క్యూవీఎస్ఈ ఫేక్ యాప్లో పెట్టుబడుల పేరుతో రూ.13.25 లక్షల మోసం కేసు నమోదు

## క్యూవీఎస్ఈ ఫేక్ యాప్లో పెట్టుబడుల పేరుతో రూ.13.25 లక్షల మోసం కేసు నమోదు

జడ్చర్ల పట్టణానికి చెందిన పలువురు వ్యక్తులు "క్యూవీఎస్ఈ" అనే యాప్లో పెట్టుబడులు పెడితే డాలర్ల రూపంలో అధిక లాభాలు వస్తాయని నమ్మి మొత్తం సుమారు రూ.13.25 లక్షలు పెట్టుబడిగా పెట్టి మోసపోయిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జడ్చర్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కమలాకర్ తెలిపారు.

ఫిర్యాదు వివరాల ప్రకారం.. ఒక వ్యక్తి క్యూవీఎస్ఈ యాప్లో తాను పెట్టుబడి పెట్టి లాభాలు పొందుతున్నట్లు చూపిస్తూ పలువురిని నమ్మించినట్లు తెలిపారు. అతను పంపిన లింక్ ద్వారా బాధితులు యాప్ను ఇన్స్టాల్ చేసుకుని మొదట కొంత మొత్తాన్ని ఫోన్పే ద్వారా చెల్లించారు. అనంతరం యాప్లో తమ పెట్టుబడి డాలర్ల రూపంలో పెరుగుతున్నట్లు కనిపించడంతో దానిని నిజమైన లాభంగా భావించి మరింత డబ్బును పెట్టుబడిగా పెట్టారు. ఈ క్రమంలో సొంత డబ్బులతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, పరిచయస్తుల నుంచి సేకరించిన మొత్తాలను ఫోన్పే, నగదు రూపంలో చెల్లించి మొత్తం రూ. 13,25,000/- వరకు పెట్టుబడి పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అయితే యాప్లో డబ్బు పెరుగుతున్నట్లు కనిపించినప్పటికీ, ఆ మొత్తాన్ని విత్డ్రా చేసుకునే అవకాశం లేకపోవడంతో అనుమానం వ్యక్తం చేశారు. సంబంధిత వ్యక్తిని సంప్రదించగా మరికొంత సమయం వేచి ఉండాలని చెప్పినట్లు తెలిపారు. దీంతో తాము మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు 18-09-2026న జడ్చర్ల పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఇన్స్పెక్టర్ కమలాకర్ తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కమలాకర్ మాట్లాడుతూ.. తక్కువ సమయంలో అధిక లాభాలు, డాలర్ల రూపంలో భారీ రాబడులు వస్తాయని చెప్పే ఫేక్ ఇన్వెస్ట్మెంట్ యాప్లు, ఆన్లైన్ స్కీమ్లను నమ్మవద్దని సూచించారు.




యాప్లో పెట్టుబడి మొత్తం లేదా లాభం పెరుగుతున్నట్లు కనిపించడం మాత్రమే అది నిజమైన పెట్టుబడి అని నిర్ధారించడానికి ఆధారం కాదని తెలిపారు. పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ, యాప్ చట్టబద్ధత, విశ్వసనీయతను పూర్తిగా పరిశీలించాలని, తెలియని లింకులపై క్లిక్ చేయవద్దని, అనుమానాస్పద యాప్లను ఇన్స్టాల్ చేయవద్దని సూచించారు. , బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్వర్డ్లు ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు.

## మహిళపై దాడి చేసింది రైల్వే పోలీస్ కాదు..

## తెలంగాణ పోలీస్ శాఖకు చెందిన హోంగార్డ్

## హఫీజ్పేట్ రైల్వే స్టేషన్ వద్ద జరిగిన ఘటనపై దక్షిణ మధ్య రైల్వే వివరణ

సికింద్రాబాద్ హఫీజ్పేట్ రైల్వే స్టేషన్ వద్ద మహిళను కొట్టి, జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లిన ఘటన పై దక్షిణ మధ్య రైల్వే స్పందించింది. మహళనై దాడి చేసింది రైల్వే పోలీస్ కాదని, రైల్వే స్టేషన్ వద్ద డ్యూటీ చేసేందుకు వచ్చిన తెలంగాణ పోలీస్ శాఖకు చెందిన హోంగార్డ్ అని దక్షిణ మధ్య రైల్వే స్పష్టం చేసింది.

# ఎరక్కపోయి... ఇరుక్కుపోయిన గులాబీ

హైదరాబాద్, సెప్టెంబర్ 19 , రాజకీయాల్లో ప్రత్యర్థిని ఇరుకున పెట్టేందుకు వేసే ప్రతి వ్యూహం ఆచితూచి ఉండాలి. ఏమాత్రం గురి తప్పినా లేదా మన రికార్డుల్లోనే లోపాలున్నా.. అది కాస్తా రివర్స్ అయి స్వయంకృతాపరాధంగా మారుతుంది. ప్రస్తుతం తెలంగాణలో భారత్ రాష్ట్ర సమితి పరిస్థితి అచ్చం చెట్టు కొట్టి నెత్తిన వేసుకున్నట్లే తయారైంది. రిజిస్ట్రేషన్ల శాఖలో నిషేధిత జాబితా అంశాన్ని పట్టుకుని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజల ఆస్తులు ప్రమాదంలో పడ్డాయంటూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించాలని బీఆర్ఎస్ అగ్రనాయకత్వం భావించింది. దాదాపు కోటి ఎకరాలకు పైగా భూములు 22ఏ జాబితాలోకి వెళ్లాయని తీవ్రస్థాయి ప్రచారం చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలోకి నెట్టాలని చూసింది. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని వేసిన ఎత్తుగడ చివరకు తమ మెడకే చుట్టుకున్నట్లయింది గులాబీ పార్టీ పరిస్థితి. సాంకేతిక కారణాలతో రిజిస్ట్రేషన్ల శాఖలో సెక్షన్ 22ఏ కింద నమోదైన కొన్ని భూముల సమస్యను పట్టుకుని, కాంగ్రెస్ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ప్రజావ్యతిరేకతను మూటగట్టాలని బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నం చేసింది. ప్రభుత్వం ప్రజల ఆస్తులను లాక్కుంటోందంటూ క్షేత్రస్థాయిలో భయాందోళనలు సృష్టించేందుకు పార్టీ శ్రేణులు వ్యూహాత్మకంగా ముందుకొచ్చాయి. అయితే, ప్రభుత్వం ఎదురుదాడి చేయకుండా అత్యంత వేగంగా స్పందించడంతో బీఆర్ఎస్ వేసిన తొలి అడుగులోనే పట్టు తప్పింది. సాంకేతిక లోపం వల్ల కొద్దిమంది రైతులు, భూయజమానులకు మాత్రమే ఈ ఇబ్బంది ఎదురైందని గుర్తించిన రేవంత్ రెడ్డి సర్కార్, ఏమాత్రం మొండిపట్టుకు పోకుండా బహిరంగంగా వివరణ ఇచ్చింది. సంబంధిత శాఖ మంత్రి ప్రజలకు అసౌకర్యం కలిగినందుకు చింతిస్తూ, రికార్డులను వెంటనే సరిచేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. రోజుల వ్యవధిలోనే సమస్య పరిష్కారం కావడంతో రైతులు, సామాన్యుల్లో ఆందోళన సద్దుమణిగింది. దీంతో ప్రభుత్వాన్ని కార్నర్ చేయాలన్న ప్రధాన ప్రతిపక్షం వ్యూహం ప్రజల్లో పెద్దగా పనిచేయకుండా పోయింది. సమస్య పరిష్కారమైనా బీఆర్ఎస్ నాయకులు అదే అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడంతో, కాంగ్రెస్ నాయకత్వం రక్షణాత్మక ధోరణి వీడి తీవ్ర ఎదురుదాడికి దిగింది. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అమల్లోకి తెచ్చిన ధరణి పోర్టల్ వెనుక జరిగిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు, కొందరు పెద్దలకు అనుకూలంగా జరిగిన మార్పుల చిట్టాను ప్రభుత్వం బయటపెట్టడం ప్రారంభించింది. ధరణి రూపకల్పన, నిర్వహణలో ఉన్న లొసుగులను రేవంత్ రెడ్డి వరుస ఆధారాలతో ప్రజల ముందుంచడంతో రాజకీయ విమర్శల దిశ ఒక్కసారిగా మారిపోయింది. ఈ పరిణామాల క్రమంలోనే కేసీఆర్ కుటుంబానికి చెందిన వ్యవసాయ క్షేత్రాలు, స్థిరాస్తుల విస్తరణ, వాటి రికార్డుల నమోదుపై ప్రభుత్వం తీవ్రస్థాయి ఆరోపణలు గుప్పించింది. అధికారంలో ఉన్న సమయంలో ఆస్తుల సమీకరణ ఎలా జరిగింది, ధరణి నిబంధనలు వీరికి ఎలా అనుకూలంగా మారాయనే అంశాలపై లెక్కలు బయటకు తీయడంతో వ్యవహారం వ్యక్తిగత ఆస్తుల వివాదంగా మారింది. దీంతో ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో సామాన్యుల 22ఏ భూముల కంటే కేసీఆర్ కుటుంబ భూములు, ఫామ్హౌస్లు, వాటి చట్టబద్ధతపైనే విస్తృత చర్చ మొదలైంది. ప్రజా సమస్యలపై పోరాడి మైలేజ్ పొందాలనుకున్న బీఆర్ఎస్, అంతిమంగా తమ సొంత రికార్డులపైనే ప్రశ్నలు లేవనెత్తే పరిస్థితి తెచ్చుకుంది. కాంగ్రెస్ సర్కార్ను ఇరుకున పెడతామనుకున్న ప్రయత్నం కాస్తా, గత పదేళ్ల నిర్ణయాలు మరియు అధినేత ఆస్తులపై ప్రజాక్షేత్రంలో విచారణ తరహా చర్చకు దారితీసింది. రాజకీయంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచబోయి, తామే చెట్టు కొట్టి మీద వేసుకున్న చందంగా బీఆర్ఎస్ ఆత్మరక్షణలో పడిపోయింది.

# కేసీఆర్ కు రెవెన్యూ నోటీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 కేసీఆర్ ఫామ్హౌస్ కేంద్రంగా ఉన్న ఎర్రవల్లి భూముల వివాదంలో విచారణ ప్రారంభమయింది. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి విచారణకు ఆదేశించడంతో రెవెన్యూ యంత్రాంగం వేగంగా రంగంలోకి దిగింది. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్హౌస్ పరిసరాల్లో వివాదంలో ఉన్న సుమారు 385 ఎకరాల భూమిలో ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూములు ఎంతమేర కలిసి ఉన్నాయో 30 రోజుల్లోగా తేల్చాలని అసెంబ్లీ వేదికగా సీఎం ఆదేశించిందున , గురువారం సిద్దిపేట జిల్లా మార్కూక్ తహశీల్దార్ కార్యాలయంలో అధికారులు ప్రత్యేకంగా సమావేశమై సంబంధిత రెవెన్యూ ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారుఈ క్రమంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ మార్కూక్ తహశీల్దార్ కార్యాలయంలో సర్వేయర్లు, రెవెన్యూ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎర్రవల్లి ఫామ్హౌస్ పరిధిలోని సర్వే నంబర్లు, పాత పహాణీలు, భూముల రిజిస్ట్రేషన్ దస్తావేజులు, ప్రభుత్వ సీలింగ్ లేదా అసైన్డ్ భూముల రికార్డులను అధికారులు సమగ్రంగా బేరీజు వేశారు. వివాదాస్పద భూములపై క్షేత్రస్థాయిలో డిజిటల్ సర్వే చేపట్టేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను రెవెన్యూ బృందాలు యుద్ధప్రాతిపదికన సిద్ధం చేస్తున్నాయి. రికార్డుల ప్రాథమిక పరిశీలన పూర్తయిన వెంటనే, సర్వే నిర్వహణకు ముందు చట్టబద్ధంగా కేసీఆర్తో పాటు సంబంధిత భూ యజమానులకు నోటీసులు జారీ చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. భూ సర్వే చట్టం ప్రకారం నోటీసులు అందజేసి, వారి సమక్షంలోనే సర్వేయర్లతో కలిసి సరిహద్దులను కొలవాలని నిర్ణయించారు. నోటీసుల వ్యవహారంపై లీగల్ అంశాలను పరిశీలిస్తున్న యంత్రాంగం, ఒకటి రెండు రోజుల్లోనే ఎర్రవల్లి ఫామ్హౌస్ ప్రతినిధులకు లేదా కేసీఆర్కు నేరుగా నోటీసులు అందజేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీలో కేసీఆర్ కుటుంబ భూముల చిట్టాను బయటపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా నెల రోజుల గడువు విధించి నేరుగా క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశించడంతో ఈ వ్యవహారం రాజకీయంగా తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఒకవేళ సర్వేలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే ప్రభుత్వం ఎలాంటి చర్యలకు దిగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్ లైన్ క్లాసులు ఐటీ, విద్యా సంస్థలకు పోలీసుల సూచనలు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 హైదరాబాద్ పరిధిలో భారీ వర్షాల అంచనాలు, గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక ట్రాఫిక్ అడ్వైజరీ ఇచ్చారు. ఈనెల 25వ తేదీ వరకు వాతావరణ పరిస్థితులు, నిమజ్జన ఊరేగింపుల కారణంగా రోడ్లపై ట్రాఫిక్ ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఐటీ కంపెనీలు, సంస్థలు, విద్యా సంస్థలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబరాబాద్ పరిధిలోని కంపెనీలు, సంస్థలు తమ ఉద్యోగులకు వీలైనంత వరకు మధ్యాహ్నం 2 గంటల తర్వాత దశలవారీగా ఎర్లీ లాగౌట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. అలాగే శుక్రవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశం కల్పించాలని కోరారు. భారీ వర్షాలు, వినాయక నిమజ్జన ఊరేగింపుల సమయంలో రోడ్లపై ప్రయాణం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించడంతో పాటు మెయిన్ రోడ్లపై ట్రాఫిక్ ఒత్తిడిని కంట్రోల్ చేసేందుకు ఈ సూచనలు చేసినట్లు పోలీసులు తెలిపారు. సైబరాబాద్ పరిధిలోని స్కూళ్లు, కాలేజీలు, ఇతర విద్యా సంస్థలు కూడా పరిస్థితులకు అనుగుణంగా ఆన్లైన్, వర్చువల్ తరగతులు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. విద్యార్థులు, చిన్నారులు ప్రతికూల వాతావరణంలో ప్రయాణించాల్సిన అవసరం లేకుండా చూడటంతో పాటు అత్యవసర సేవలకు రహదారులపై సాఫీగా రాకపోకలు సాగేందుకు సహకరించాలని సైబరాబాద్ పోలీసులు కోరారు. వాతావరణ పరిస్థితులు, గణేశ్ నిమజ్జన కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు కంపెనీలు, సంస్థలు, విద్యా సంస్థలు ఈ ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిగణనలోకి తీసుకోవాలని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు జారీ చేసిన అడ్వైజరీలో పేర్కొన్నారు.

ఉద్యోగులు, విద్యార్థుల ప్రయాణ అవసరాలను తగ్గించడం ద్వారా రోడ్లపై రద్దీని కంట్రోల్ చేయవచ్చని పోలీసులు తెలిపారు. ప్రజల భద్రత, సాఫీగా ట్రాఫిక్ నిర్వహణ కోసం సంస్థలు, విద్యా సంస్థలు పోలీసులకు సహకరించాలని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# పాకిస్తాన్ లో పెట్రోల్ 384.34, డీజిల్ ధర 415.83

ఇస్లామాబాద్, సెప్టెంబర్ 19, పశ్చిమాసియాలో రోజురోజుకూ పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధనాన్ని ఆదా చేసేందుకు పాకిస్థాన్ పొదుపు చర్యలను ప్రకటించింది. ఈ ఏడాది పాక్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఇది రెండోసారి. పాకిస్థాన్ మంత్రివర్గం ఆమోదించిన ఈ నిబంధనలు మూడు నెలల పాటు అమలులో ఉంటాయి. ఈ వారంలోనే పాకిస్థాన్ ప్రభుత్వం లీటర్ పెట్రోల్పై పీకేఆర్ 4.10, హై-స్పీడ్ డీజిల్పై పీకేఆర్ 6.41 చొప్పున ధరలను పెంచింది. దీంతో పెట్రోల్ ధర పీకేఆర్ 384.34కు, డీజిల్ ధర పీకేఆర్ 415.83కు చేరాయి. హోర్ముజ్, బాబ్-ఎల్-మండేబ్ జలసంధుల వద్ద భద్రతా పరిస్థితులు క్షీణించడం వల్ల చమురు సరఫరాకు అంతరాయం కలగొచ్చని అధికారికంగా హెచ్చరిస్తూనే ఈ ధరల పెంపును ప్రకటించారు. అదే సమయంలో రియాద్ ఈస్ట్-వెస్ట్ పైప్లైన్పై దాడితో సహా సౌదీ ఇంధన మౌలిక సదుపాయాలపై జరిగిన దాడుల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగాయి. పెట్రోలియం ఉత్పత్తుల ధరల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ వాహనాలకు ఇచ్చే ఇంధన కోటాను తగ్గించాలని పాకిస్థాన్ ఆదేశించింది. కొత్త వాహనాల కొనుగోలు, అధికారుల విదేశీ పర్యటనలు, అధికారిక విందులపై (విదేశీ ప్రతినిధులు, సందర్శకులకు ఇచ్చే విందులు మినహా) నిషేధం విధించింది. దీంతో పాటు, ఐటీ సేకరణ మినహా ఇతర మన్నికైన వస్తువులను ప్రభుత్వం కొనుగోలు చేయడాన్ని నిషేధించారు. సమావేశాలను టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించాలని నిర్ణయించారు. మార్కెట్లను రాత్రి 9 గంటలకు, కళ్యాణ మండపాలను 10 గంటలకు, రెస్టారెంట్లను 11 గంటలకు మూసివేయాల్సి ఉంటుంది. అయితే ఔషధ దుకాణాలు, మెడికల్ ల్యాబ్లకు ఈ ఆంక్షల నుండి మినహాయింపు ఇచ్చారు. ఏప్రిల్లో విధించిన పొదుపు చర్యలను, ఇరుపక్షాల మధ్య శాంతి చర్చలు ప్రారంభం కావడంతో జూన్లో ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం ఈ ఆంక్షలు ఇస్లామాబాద్కే పరిమితమైనప్పటికీ, ప్రావిన్సులు (రాష్ట్రాలు), ప్రాంతీయ ప్రభుత్వాలు కూడా ఇవే విధానాలను అమలు చేయాలని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. అంతర్జాతీయ చమురు మార్కెట్లో విపరీతంగా పెరుగుతున్న ధరలు, ప్రభుత్వంపై భారాన్ని తట్టుకునే సామర్థ్యాన్ని ఎలా దెబ్బతీస్తున్నాయో పాక్ ఇంధన శాఖ మంత్రి అవాయిస్ లెఘారీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్లు మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరించారు. మరోవైపు, పెంచిన ధరలను తగ్గించకపోతే వచ్చే వారం దేశవ్యాప్త నిరసనలు చేపడతామని 'జమాత్-ఇ-ఇస్లామీ' (ఏఐ) పార్టీ హెచ్చరించడంతో ప్రజాందోళనలు చెలరేగుతాయనే ఒత్తిడిలో ప్రభుత్వం ఉంది.

## రావణ్ కష్టాలు తీరినట్టేనా

విజయవాడ, సెప్టెంబర్ 19, సోషల్ మీడియా వేదికగా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేలా ప్రేరేపించారనే తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ కేసులో గన్నవరం న్యాయస్థానం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసు విచారణను లోతుగా చేపట్టేందుకు నిందితుడిని ఏడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగించాలని దర్యాప్తు అధికారులు వేసిన పిటిషన్ను కోర్టు ఆమోదించింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం నుంచి గన్నవరం పోలీసులు జోసెఫ్ను తమ కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించనున్నారు. యువతను తీవ్రవాదం వైపు ఆకర్షితులయ్యేలా రెచ్చగొట్టే వీడియోలు రూపొందించడం, ఏలూరులో నిర్వహించిన ఒక సమావేశంలో మావోయిస్టు సిద్ధాంతాలను సమర్థిస్తూ, నక్సలిజం వైపు మళ్లేలా ప్రసంగాలు చేశారనే ఆరోపణలపై ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఇప్పటికే ఆయనపై కఠినమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. రాజ్యాంగ వ్యవస్థలను కూల్చివేయాలనేలా ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రజా శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగించేలా ఉన్నాయని ప్రాథమిక దర్యాప్తులో అధికారులు నిర్ధారించారు. ఈ నేరపూరిత నెట్వర్క్ వెనుక ఉన్న అసలు సూత్రధారులను వెలికితీయడానికి కస్టడీ విచారణ తప్పనిసరి అని పోలీసులు కోర్టులో వాదించారు. ముఖ్యంగా కొందరు మాజీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో జోసెఫ్కు ఉన్న సంబంధాలు, అతనికి వెనుకనుండి అందుతున్న నిధుల మూలాలు, ఈ ప్రసంగాల వెనుక దాగి ఉన్న రాజకీయ ప్రయోజనాలపై సమగ్రంగా ఆరా తీయాల్సి ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి, కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకుంటూ వారం రోజుల పోలీస్ కస్టడీకి అనుమతినిచ్చారు. కోర్టు అనుమతి లభించడంతో రేపటి నుంచి ప్రారంభమయ్యే విచారణ అత్యంత కీలకంగా మారింది. కస్టడీ సమయంలో జోసెఫ్ డిజిటల్ పరికరాలు, సోషల్ మీడియా ఖాతాల నిర్వహణ, తెరవెనుక సహకరించిన వ్యక్తుల వివరాలను అధికారులు సేకరించనున్నారు. ఈ ఏడు రోజుల విచారణలో ఎలాంటి నిజాలు, కుట్ర కోణాలు వెలుగులోకి వస్తాయనేది కీలకం.

# సూటిగా సుత్తి లేకుండా కేసీఆర్ టార్గెట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19 తెలంగాణ శాసనసభ వేదికగా నిషేధిత భూముల జాబితా, ధరణి పోర్టల్ నిర్వహణపై జరిగిన చర్చ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. గత కొన్నివారాలుగా 22ం జాబితాలో ప్రైవేట్ భూములు చిక్కుకున్నాయంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు చేసిన ఆరోపణలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అసెంబ్లీలో అధికారిక రికార్డులతో సుదీర్ఘమైన వివరణ ఇచ్చారు. ఈ క్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి చెందిన భూకమతాలు, ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లోని సర్వే నంబర్ల వివరాలను బహిర్గతం చేయడం ద్వారా ప్రతిపక్షం లేవనెత్తిన విమర్శనాత్మక అస్త్రాన్ని ప్రభుత్వం వ్యూహాత్మకంగా తిప్పికొట్టే ప్రయత్నం చేసింది.

సీఎం రేవంత్ రెడ్డి సభలో సమర్పించిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా మార్కూక్ మండల పరిధిలో కేసీఆర్ కుటుంబ సభ్యులు , బంధువుల పేరిట అధికారికంగా సుమారు 440 ఎకరాల భూకమతాలు రికార్డుల్లో ఉన్నట్లు తెలిపారు. కేసీఆర్ పేరిట 67 ఎకరాలు, కేటీఆర్ దంపతులు , వారి కుమారుడి పేరిట 123 ఎకరాలు, హరీశ్ రావు కుటుంబం పేరిట 29.5 ఎకరాలు, మరియు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ రావు కుటుంబం పేరిట 79 ఎకరాల భూములు ఉన్నట్లు వెల్లడించారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ కాంపౌండ్ పరిధిలో , దాని చుట్టుపక్కల విస్తరించి ఉన్న ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల కేటాయింపులపై 30 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని సిద్దిపేట కలెక్టర్, రెవెన్యూ అధికారులను ఆదేశిస్తూ, నివేదిక ఆధారంగా ఆక్రమిత ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన దళితులకు పంపిణీ చేస్తామని సీఎం ప్రకటించారు. ఈ దాడి వెనుక కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా రాజకీయ, చట్టపరమైన ప్రణాళికతో ముందడుగు వేసినట్లు కనిపిస్తోంది. ధరణి పోర్టల్ అమలులోకి వచ్చాక భూ క్రమబద్ధీకరణ విధానాలు, రికార్డుల సవరణల పేరిట గత ప్రభుత్వ పెద్దలు లబ్ధి పొందారనే ఆరోపణలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం కాంగ్రెస్ ముఖ్య ఉద్దేశం. అదే సమయంలో, రాష్ట్రంలో 1 కోటి ఎకరాలు 22ం నిషేధిత జాబితాలో ఉందన్న ప్రతిపక్షాల వ్యాఖ్యలను సీఎం ఖండించారు. అడవులు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ స్థలాలు, చెరువులు కలిపి మొత్తం 1.01 కోట్ల ఎకరాలు శాశ్వత నిషేధిత కేటగిరీలో ఉంటాయని, పౌరుల మధ్య వివాదంలో ఉన్న ప్రైవేట్ భూమి కేవలం 3.05 లక్షల ఎకరాలు మాత్రమేనని సీఎం స్పష్టత ఇచ్చారు. ఈ విమర్శలపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా స్పందిస్తున్నాయి. కేసీఆర్ కుటుంబం వద్ద ఉన్న భూములన్నీ దశాబ్దాల క్రితం చట్టబద్ధంగా కొనుగోలు చేసినవేనని, వ్యవసాయ అవసరాల కోసమే వాటిని ఉపయోగిస్తున్నామని ఆ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. తమపై వస్తున్న ఆరోపణలు కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం తమ పరిపాలనా లోపాలను, 22ం డిజిటలైజేషన్ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్ అని బీఆర్ఎస్ ప్రతిదాడికి దిగింది. నిబంధనలకు విరుద్ధంగా భూసేకరణ జరిగిందని నిరూపిస్తే ఎలాంటి చర్యలకైనా సిద్ధమేనని ప్రతిపక్ష నేతలు సవాల్ విసురుతున్నారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూముల తనిఖీకి విచారణ బృందాన్ని ప్రకటించడం, సేకరించిన ప్రభుత్వ భూములను దళిత రైతులకు కేటాయిస్తామని ప్రకటించడం కాంగ్రెస్ పార్టీకి సామాజికంగా కలిసివచ్చే అంశం. అసైన్డ్ భూముల రక్షణ మరియు దళిత హక్కుల అంశాన్ని ఎత్తుకోవడం ద్వారా బీఆర్ఎస్‌కు డిఫెన్సివ్ వాతావరణాన్ని సృష్టించవచ్చని అధికార పక్షం ఆశిస్తోంది.

అంతిమంగా చూస్తే, 22ం వివాదం కాస్తా తెలంగాణలో వ్యక్తిగత ఆస్తులు – భూముల విచారణ రణరంగానికి దారితీసింది. 30 రోజుల్లో సిద్దిపేట రెవెన్యూ అధికారులు ఇచ్చే విచారణ నివేదిక రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి మలుపులు తిప్పుతుందో, మరియు ఈ విచారణ ఎంతవరకు చట్టబద్ధంగా ముందుకు సాగుతుందో వేచి చూడాల్సి ఉంది.

# 24నే నిమజ్జనం

హైదరాబాద్, సెప్టెంబర్ 19 ,గణేశోత్సవం ప్రారంభం కాగానే వినాయక నిమజ్జనం ఎప్పుడు చేస్తారు అనేది సర్వసాధారణంగా అడిగే ప్రశ్నలలో ఒకటి. కొందరు గణపతిని ఒకటిన్నర రోజులోపే నిమజ్జనం చేస్తే, మరికొందరు మూడవ, ఐదవ లేదా ఏడవ రోజు చేస్తారు. అయితే నవరాత్రులు పూజలందిస్తే తుదివీడ్కోలు అనంత చతుర్దశి రోజున జరుగుతుంది. 2026లో అనంత చతుర్దశి తేదీ సెప్టెంబర్ 24 , 25 తేదీ ఎప్పుడొచ్చింది? ఎందుకంటే సెప్టెంబర్ 24న చతుర్దశి ఆలస్యంగా ప్రారంభమవుతుంది. క్యాలెండర్ ప్రకారం, గణేష్ నిమజ్జనానికి ప్రధాన తేదీ 2026 సెప్టెంబర్ 25 శుక్రవారంతెలుగు పంచాంగం ప్రకారం భాద్రపద మాసం శుక్ల పక్ష చతుర్దశి సెప్టెంబర్ 24వ తేదీ రాత్రి 09:53 గంటలకు ప్రారంభమై, సెప్టెంబర్ 25వ తేదీ రాత్రి సుమారు 10:10 గంటలకు ముగుస్తుంది. సెప్టెంబర్ 24వ తేదీ సూర్యోదయం సమయానికి త్రయోదశి ఉంటుంది.. సెప్టెంబర్ 25వ తేదీన చతుర్దశి తిథి సూర్యోదయం, సూర్యాస్తమయానికి ఉంటుంది. అందుకే ఉదయించే తేదీని బట్టి అనంత చతుర్దశి వ్రతం, విష్ణు పూజ , పదవ రోజున చేసే గణేష్ నిమజ్జనం చేస్తారు. ఈ ఏడాది సెప్టెంబర్ 25 తేదీన గణేష్ నిమజ్జనం. వివిధ నగరాల్లో సూర్యోదయం మరియు స్థానిక క్యాలెండర్ల కారణంగా, తేదీ ముగిసే సమయం ఒకటి లేదా రెండు నిమిషాలు మారవచ్చు. అయినప్పటికీ, పండుగతేదీమాత్రం సెప్టెంబర్ 25న మారదు. గణేష్ నిమజ్జనానికి 2026కి శుభ సమయం ఉదయం శుభ సమయం: ఉదయం 6:11 నుంచి 10:42 వరకు.

మధ్యాహ్నానికి శుభ సమయం: 12:13 జూఎ నుంచి 1:43 జూఎ వరకు.

సాయంకాల ముహూర్తం: సాయంత్రం 4:44 నుంచి 6:14 వరకు.

రాత్రి సమయం: రాత్రి 9:14 నుంచి 10:43 వరకు.

వీటిలో కుటుంబాలకు అత్యంత అనుకూలమైన సమయం ఉదయం 6:11 నుంచి 10:42 వరకు. బహిరంగ పండాల్‌ల వద్ద నిమజ్జన ఊరేగింపు సుదీర్ఘంగా ఉండటం వల్ల, సాయంత్రం లేదా రాత్రి సమయాన్ని కూడా ఎంచుకుంటారు. ముంబై, పూణే, నాగ్‌పూర్ లేదా ఇతర నగరాల్లోని చౌఘడియా సమయాలు కొన్ని నిమిషాల తేడాతో మారవచ్చు. అందువల్ల, స్థానిక పరిపాలన యంత్రాంగం నిర్దేశించిన సూర్యోదయం , నిమజ్జన సమయాలను పరిగణనలోకి తీసుకోవడం ముఖ్యం. నిమజ్జనానికి ముందు సాధారణ గణేశ పూజ చేయండి. బప్పాకు దూర్వా , ఎర్రని పువ్వులు, మోదకాలు లేదా ఇంట్లో తయారుచేసిన ప్రసాదాన్ని సమర్పించండి. అనంతరం, కుటుంబ సభ్యులందరూ కలిసి హారతి ఇవ్వండి. పూజ సమయంలో చేసిన ఏవైనా తప్పులకు క్షమాపణ కోరి, వచ్చే ఏడాది ఆయన తిరిగి రావాలని ప్రార్థించండి. చాలా కుటుంబాలలో విగ్రహాన్ని కదిలించే ముందు కొద్దిగా ముందుకు జరిపే సంప్రదాయం కూడా ఉంది. ఇది ప్రతిష్ఠాపన పూర్తయిందని .. బయలుదేరడానికి సమయం ఆసన్నమైందని సూచించే సంకేతంగా పరిగణిస్తారు. దీని తర్వాత చేతిలో అక్షతలు, పువ్వులు పట్టుకుని నిమజ్జనం కోసం సంకల్పం చేస్తారు. ఇంట్లో ప్రతిష్ఠించిన చిన్న మట్టి విగ్రహాలను ఒక బకెట్‌లో లేదా పెద్ద పాత్రలో నిమజ్జనం చేయవచ్చు. విగ్రహం పూర్తిగా కరిగిపోయిన తర్వాత, ఆ నీటిని ఒక మొక్కలో లేదా శుభ్రమైన మట్టిలో పోయడం పర్యావరణానికి మంచిది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన లేదా రసాయన రంగులతో చిత్రించిన విగ్రహాలను నదులు, చెరువులు లేదా సముద్రంలో నిమజ్జనం చేయకూడదు. గణేష్ చతుర్థి నాడు ప్రారంభమయ్యే ఈ వేడుక అనంత చతుర్దశి నాడు ముగుస్తుంది. ఈ రోజున, అనంత స్వరూపుడైన విష్ణుమూర్తిని పూజించడం 14 ముడుకుల అనంత సూత్రాన్ని ధరించడం సాంప్రదాయం. ఒకవైపు బప్పాకు వీడ్కోలు పలుకుతూ, మరోవైపు కుటుంబ రక్షణ, సంతోషం , శ్రేయస్సు కోసం విష్ణుమూర్తిని ప్రార్థిస్తారు. అందువల్ల 2026 సంవత్సర క్యాలెండర్‌లో గణేష్ విసర్జన ప్రధాన తేదీ అయిన సెప్టెంబర్ 25ని గమనించండి. సెప్టెంబర్ 24 రాత్రి చతుర్దశి వచ్చినప్పటికీ, పూజ , నిమజ్జనం మరుసటి రోజు, ఉదయించే శుక్లం నాడు జరుగుతాయి.

# హుస్సేన్ సాగర్ లో నిమజ్జన వివాదం మళ్లీ తీవ్రరూపం

హైదరాబాద్, సెప్టెంబర్ 19 , హైదరాబాద్‌లో వినాయక చవితి వేడుకలు ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో ప్రతి ఏటా తలెత్తే హుస్సేన్‌సాగర్ నిమజ్జనం వివాదం మళ్లీ తీవ్రరూపం దాల్చింది. ట్యాంక్ బండ్ పైభాగాన ఎలాంటి నిమజ్జనాలు నిర్వహించకూడదని జీహెచ్ఎంసీ , హైదరాబాద్ పోలీసులు స్పష్టమైన ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయగా.. శతాబ్దాలుగా వస్తున్న సంప్రదాయ స్థలమైన ట్యాంక్ బండ్‌పైనే నిమజ్జనాలు జరిపి తీరతామని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి తెగేసి చెప్పింది. అధికారుల హెచ్చరికలు ఒకవైపు, ఉత్సవ సమితి హెచ్చరికలు మరోవైపు ఉండటంతో, అసలు కోర్టు తీర్పులేమిటి, హుస్సేన్‌సాగర్‌లో ఏ తరహా విగ్రహాలను నిమజ్జనం చేయడానికి అనుమతి ఉందనే అంశంపై సగటు భక్తుల్లో తీవ్ర అయోమయం నెలకొంది. హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాల నిమజ్జనంపై ప్రధానంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు , మట్టి విగ్రహాల మధ్య వ్యత్యాసాన్ని చట్టం స్పష్టంగా నిర్వచించింది. 2021లో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ప్రకారం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా హుస్సేన్‌సాగర్‌తో పాటు ఎలాంటి సహజ జలాశయాలలోనూ పిఓపి విగ్రహాలను నిమజ్జనం చేయకూడదు. పిఓపి విగ్రహాల కోసం నగరవ్యాప్తంగా ప్రత్యేకంగా నిర్మించిన బేబీ పాండ్స్ లో మాత్రమే నిమజ్జనం జరపాలని ఆదేశించింది. అయితే, పర్యావరణ అనుకూలమైన మట్టి విగ్రహాలకు మాత్రం హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనానికి అనుమతి ఉంది. ఈ క్రమంలోనే ట్యాంక్ బండ్ ప్రధాన వివాద స్పదంగా మారింది. ట్రాఫిక్ సమస్యలు, భద్రత , సరస్సు పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని అప్పర్ ట్యాంక్ బండ్ నుంచి నేరుగా విగ్రహాలను నీటిలో వేయడాన్ని హైకోర్టు నిషేధించింది. అందుకోసమే అధికారులు ట్యాంక్ బండ్ వెంట 10 అడుగుల ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసి, ఫ్లెక్సీ బోర్డులు తగిలించారు. దీనికి ప్రత్యామ్నాయంగా పిఓపి రహిత, మట్టి విగ్రహాల నిమజ్జనం కోసం హుస్సేన్‌సాగర్ తీరంలోని ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్ పరిసరాల్లో ప్రత్యేక క్రేన్లను అందుబాటులో ఉంచారు. అయితే, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మాత్రం అధికారుల నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ట్యాంక్ బండ్ అనేది సాంప్రదాయక నిమజ్జన కేంద్రమని, అక్కడ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తోంది. అధికారులు తొలగించకపోతే తామే స్వయంగా ఆ బోర్డులను తీసివేసి, యథావిధిగా ట్యాంక్ బండ్‌పై నుంచే నిమజ్జనం జరిపి తీరతామని హెచ్చరించింది. పిఓపి , మట్టి విగ్రహాలనే భేదం లేకుండా ఉత్సవ మూర్తులన్నింటినీ హుస్సేన్‌సాగర్‌లోనే నిమజ్జనం చేయాలనేది ఉత్సవ సమితి ప్రధాన డిమాండ్. వాస్తవానికి గడచిన కొన్నేళ్లుగా ఇది ఒక పరిపాటిగా మారిపోయింది. ప్రతి ఏటా నిమజ్జనానికి కొద్దిరోజుల ముందు పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు ట్యాంక్ బండ్‌పై నిమజ్జనం లేదంటూ బోర్డులు పెట్టడం, ఆ తర్వాత నిమజ్జనం రోజున విపరీతమైన భక్తుల రద్దీ, ట్రాఫిక్ ఒత్తిడి మరియు ఉత్సవ సమితుల పట్టుదల కారణంగా క్రేన్లను ఏర్పాటు చేసి అనుమతించడం జరుగుతోంది. గత ఏడాది కూడా ట్యాంక్ బండ్‌పై 12 క్రేన్లు, ఎన్టీఆర్ మార్గ్‌లో 12 క్రేన్లు, పీపుల్స్ ప్లాజా వద్ద 8 క్రేన్లను ఏర్పాటు చేసి నిమజ్జనాలు నిర్వహించారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వం , పోలీసులు చట్టపరమైన నిబంధనలను అమలు చేయడంలోనూ, పర్యావరణాన్ని కాపాడటంలోనూ, భక్తుల భావోద్వేగాలను బ్యాలెన్స్ చేయడంలోనూ కత్తిమీద సాము చేస్తున్నారు. ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజాల నుంచి మాత్రమే మట్టి విగ్రహాల నిమజ్జనాన్ని క్రమబద్ధీకరించడం, పిఓపి విగ్రహాలను బేబీ పాండ్స్ వైపు మళ్లించడం అధికారుల లక్ష్యం కాగా.. ఉత్సవ సమితి హెచ్చరికల మధ్య తుది నిమజ్జనం రోజున ట్యాంక్ బండ్ వద్ద ఎలాంటి పరిస్థితులు నెలకొంటాయో వేచి చూడాలి.

# 70 రూపాయిలకు చేరిన ఉల్లి

హైదరాబాద్, సెప్టెంబర్ 19, రెండు నెలల క్రితం వంద రూపాయలకు ఐదు కిలోల చొప్పున ఉల్లిపాయలను విక్రయించారు. ట్రాలీ ఆటోల మీద వీధి వీధి తిరిగి మరీ సరసమైన ధరలకే ప్రయివేట్ వ్యక్తులు ఉల్లిపాయలను విక్రయించారు. కానీ ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. అవే ట్రాలీ ఆటోల మీద కిలో రూ.70 చొప్పన విక్రయిస్తున్నారు. పరిస్థితి చూస్తుంటే ఉల్లి ధర త్వరలోనే సెంచరీకి చేరువయ్యేలా ఉంది. ఉల్లి ధరల ఇంతలా పెరగడానికి కారణమేంటి? వంటల్లో ఉల్లికి ప్రత్యామ్నాయమేంటో చూద్దాం. వంటింట్లో అత్యవసరమైన ఉల్లిపాయ ధరలు గత కొంత కాలంగా భారీగా పెరుగుతున్నాయి. రిటైల్ మార్కెట్లో ఉల్లిపాయల ధర కిలో రూ.70కి చేరుకుంది. పంట దిగుబడి తగ్గడం, మార్కెట్లో సరఫరా తగ్గడంతో ఉల్లి ధరలు వేగంగా పెరుగుతున్నాయి. జులై వరకు హైదరాబాద్‌లో రూ.100కు 4 లేదా 5 కిలోల ఉల్లిపాయలను రోడ్ల పక్కన ట్రాలీ ఆటోల్లో ఉంచి విక్రయించేవారు. కానీ ఇప్పుడు అదే చోట, అదే ట్రాలీ వాహనాల్లో కనిష్టంగా రూ.200కు 3 కిలోల చొప్పున విక్రయిస్తున్నారు. ఈ చొప్పున చూస్తే ఉల్లి ధరలు ఒక్కటెండు నెలల్లోనే ఎంతా పెరిగాయో అర్థం చేసుకోవచ్చు. ఏపీ ప్రభుత్వం ఉల్లి ధరల భారం సామాన్యుడిపై పడకుండా చూడటం కోసం రైతు బజార్లలో రూ.35 కిలో చొప్పున విక్రయించే ప్రయత్నాలు చేస్తోంది. కేంద్రం ధరల స్థిరీకరణ నిధి ద్వారా 1 లక్షా 21 వేల టన్నుల బఫర్ స్టాక్‌ను మార్కెట్లోకి రిలీజ్ చేస్తోంది. అయితే ఇవి అందరికీ చేరడం లేదు. మరోవైపు వ్యాపారులు కృతిమ కొరతను సృష్టించి పరిస్థితిని సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉల్లి ధరల సెగ తగులుతోంది. హైదరాబాద్‌లోని మలక్‌పేట మార్కెట్లో క్వింటాల్ ఉల్లి రూ.5500 వరకు పలుకుతోందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి మాత్రమే ఉల్లి సరఫరా అవుతోంది. రోజుకు 5–6 వేల క్వింటాళ్ల వరకు విక్రయిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. సాధారణ రోజుల్లో మలక్‌పేట మార్కెట్‌కు గరిష్టంగా 8 వేల క్వింటాళ్ల వరకు ఉల్లిపాయలు వస్తుంటాయి. సీజన్లో రోజుకు 12 వేల టన్నుల నుంచి 15 వేల టన్నుల ఉల్లిపాయలు వచ్చే సందర్భాలు కూడా ఉంటాయి. ఉల్లి దిగుబడి ఎక్కువగా వస్తే రైతుకు గిట్టుబాటు ధర అందడం లేదు. దిగుబడి తగ్గితే ధరలు పెరిగి సామాన్యులపై భారం పడుతోంది. గత ఏడాది అక్టోబర్‌లో ఏపీలోని తాడేపల్లిగూడెం మార్కెట్లో కడప జిల్లా నుంచి వచ్చిన ఉల్లి పంటను కిలో కేవలం రూ.5–10 చొప్పున కొనుగోలు చేశారు. ఉల్లి ధరలు పెరగడానికి పంట దిగుబడి తగ్గడంతోపాటు.. సరైన పంట నిల్వ సదుపాయాలు లేకపోవడం కూడా కారణమే. కోల్డ్ స్టోరేజీ సదుపాయాలు లేకపోవడంతో తేమ కారణంగా నిల్వ చేసిన ఉల్లిపాయల్లో 30 శాతానికిపైగా కుళ్లిపోయే అవకాశం ఉంది. దీని వల్ల పంట వృథా అవుతోంది. రవాణా ఛార్జీలు, అక్రమ నిల్వలు, పాత పంట నిల్వలు అయిపోయి కొత్త పంట మార్కెట్‌కు రాకపోవడం, అంతర్జాతీయ డిమాండ్ లాంటి అంశాలు కూడా ఉల్లి ధరలు పెరగడానికి కారణం అవుతాయి.

# ఎన్నికల అఫడవిట్లే ఆధారాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 19, తెలంగాణ రాజకీయాల్లో భూ వివాదాలు ఎప్పుడూ కేంద్రబిందువుగానే ఉంటాయి. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న రాజకీయ పరిణామాలు ఆరోపణల స్థాయిని దాటిపోయాయి. అఫిడవిట్లు, అధికారిక పత్రాల ఆధారంగా సాగుతున్న ఒక వ్యూహాత్మక దాడిలా మారా యి. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాంహౌస్ భూములు, కేటీఆర్ ఆస్తుల సంపాదనపై కాంగ్రెస్ ప్రభుత్వం పావులు కదుపుతున్న తీరు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రత్యేకించి గత ఎన్నికల అఫిడవిట్లను ప్రస్తుత వాస్తవాలతో బేరీజు వేస్తూ అధికార పార్టీ సంధిస్తున్న ప్రశ్నలు బీఆర్ఎస్ ను డిఫెన్స్‌లో పడేశాయి. రాజకీయ నాయకుల గతం, వర్తమానం మధ్య వ్యత్యాసాన్ని ఎత్తిచూపడానికి ఎన్నికల సంఘానికి సమర్పించే అఫిడవిట్లే అత్యంత ప్రామాణికమైన ఆయుధాలుగా మారుతుంటాయి. ప్రస్తుత వివాదంలోనూ కాంగ్రెస్ పార్టీ ఇదే వ్యూహాన్ని అమలు చేస్తోంది. 2004లో కరీంనగర్ లోక్‌సభ స్థానం నుండి పోటీ చేసిన సమయంలో కేసీఆర్ సమర్పించిన అఫిడవిట్‌లో తనకు కనీసం ఒక్క ఎకరం వ్యవసాయ భూమి కూడా లేదని స్పష్టంగా పేర్కొన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 2009 ఎన్నికల అఫిడవిట్‌లో కేవలం ఒక ఎకరం భూమి మాత్రమే ఉన్నట్లు చూపించారని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు..కానీ తెలంగాణ ఉద్యమ కాలం నుంచి పదేళ్ల అధికార కాలం ముగిసేనాటికి ఈ కుటుంబం చేతిలో వేల ఎకరాల భూములు, వేల కోట్ల రూపాయల ఆస్తులు ఎలా సమకూరాయనేది ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశమైంది. ఉద్యమ సమయంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని, ప్రాణాలర్పించిన అమరుల త్యాగాల పునాదుల మీద ఎదిగిన నేతలు, ఇంత భారీ స్థాయిలో సంపదను ఎలా కూడబెట్టారంటూ కాంగ్రెస్ సంధిస్తున్న ప్రశ్నలు రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ధరణి పోర్టల్ నిర్వహణపై అప్పట్లోనే విపక్షాలు అనేక విమర్శలు చేశాయి. అయితే ఇప్పుడు అదే ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని ప్రభుత్వ భూములు, పేదల భూములు, దళితులకు కేటాయించిన అసైన్డ్ భూములు కూడా అన్యాక్రాంతమయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ అంశంపై కేవలం మాటల యుద్ధానికే పరిమితం కాకుండా.. సెక్షన్ 22ఏ కింద ఉన్న వివాదాస్పద భూముల వ్యవహారంపై అధికారికంగా రెవెన్యూ విచారణకు ఆదేశించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ పైచేయి సాధించింది. అసెంబ్లీ వేదికగా కూడా దీనికి సంబంధించిన పత్రాలను, రికార్డులను ప్రదర్శించి బీఆర్ఎస్ అధినేతను ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. కేసీఆర్‌ను 'భూబకాసురుడు' అంటూ మంత్రి పొంగులేటి అభివర్ణించడం, కేటీఆర్ తన అమెరికన్ సక్సెస్, వంశపారంపర్య ఆస్తుల గురించి చేసిన ప్రకటనలను తప్పుపట్టడం చూస్తుంటే, రాబోయే రోజుల్లో ఈ అంశం మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది.

# ప్రీతిరెడ్డికి కమలమే ఛాయిస్

హైదరాబాద్, సెప్టెంబర్ 19, మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత చామకూర మల్లారెడ్డి కోడలు డాక్టర్ ప్రీతిరెడ్డి క్రమంగా మేడ్చల్, మల్కాజిగిరి పరిధిలో తన రాజకీయ యాక్టివిటీని వేగవంతం చేస్తున్నారు. నియోజకవర్గంలో సొంత వర్గంతో ప్రత్యేక పర్యటనలు, జాతీయవాద భావజాలం ప్రతిబింబించేలా విద్యాసంస్థల్లో కార్యక్రమాలు, కమలనాథులతో తరచూ సత్సంబంధాలు కొనసాగిస్తుండటం చేస్తున్నారు. బీఆర్ఎస్‌లో ఊహాగానాలు, స్థానిక నేతల విభేదాల నడుమ ఆమె చూపు బీజేపీ వైపే ఉందన్న సంకేతాలు బలంగా వినిపిస్తుండటంతో.. మల్లారెడ్డి ఫ్యామిలీ నుంచి త్వరలోనే ఒకరు కమలం గూటికి చేరడం దాదాపు ఖాయమనే ప్రచారం సాగుతోంది. ప్రీతిరెడ్డి బీజేపీ బాట పడితే పార్టీలో సరికొత్త రాజకీయ చిక్కులు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి ప్రస్తుతం ఈటల రాజేందర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒకవేళ మల్లారెడ్డి కుటుంబం తమ పొలిటికల్ ఫ్యూచర్ కోసం బీజేపీ లోక్‌సభ టికెట్ సీనియర్ నేత ఈటల రాజేందర్ భవిష్యత్ ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారుతుంది. గతంలో హుజూరాబాద్ ప్రాతినిధ్యం వహించిన ఈటల, రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి మళ్లీ తన పాత నియోజకవర్గానికి పరిమితమవుతారా లేక మల్కాజిగిరి కేంద్రంగానే తన పట్టు నిలుపుకుంటారా అనేది కమలం పార్టీలో ఆసక్తికరమైన చర్చకు దారితీస్తోంది. మరోవైపు బీఆర్ఎస్ పార్టీలో కొనసాగితే భవిష్యత్తులో గెలుపు అవకాశాలు ఏమాత్రం ఉంటాయనే దానిపై మల్లారెడ్డి కుటుంబంలో అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధికారంలో లేకపోవడం, గులాబీ కేడర్‌లోనూ నిస్తేజం ఆవహించడంతో బీఆర్ఎస్ టికెట్ ఖాయమైనా విజయావకాశాలు తక్కువేనని వారు భావిస్తున్నట్లు సమాచారం. అందుకే, ప్రాంతీయ పార్టీల కంటే జాతీయ స్థాయిలో బలంగా ఉన్న బీజేపీని ఎంచుకోవడమే తమ రాజకీయ, వ్యాపార ప్రయోజనాలకు రక్షణగా ఉంటుందనే వ్యూహంతోనే ఈ పావులు కదుపుతున్నట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో విశ్లేషణలు వస్తున్నాయి. మల్లారెడ్డి కుటుంబంలో మొదలైన ఈ రాజకీయ మార్పుల తుఫాను కేవలం ఒక కుటుంబానికే పరిమితం కాకుండా, మేడ్చల్–మల్కాజిగిరి ప్రాంతంలోని గులాబీ, కమలం పార్టీల సమీకరణాలను తలకిందులు చేసేలా కనిపిస్తోంది.

# ఎర్రవల్లి ఫామ్ హౌస్ సర్వే షురూ

హైదరాబాద్, సెప్టెంబర్19 , మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూముల వ్యవహారం మరోసారి తెలంగాణ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి, వెంకటాపూర్ పరిధిలోని భూములకు సంబంధించిన రికార్డులను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. భూముల సర్వే నంబర్లు, పాత రికార్డులు, ప్రభుత్వ భూములు, పట్టా భూముల వివరాలను సేకరిస్తూ రిపోర్టును తయారు చేసే పనిలో అధికారులు పడ్డారు. కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూములపై వాస్తవాలను తేల్చేందుకు విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. బుధవారం రోజున అసెంబ్లీలో అధికారులను ఆదేశించిన నేపథ్యంలో ఈ ప్రక్రియ మొదలైంది. విచారణను 30 రోజుల్లో పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇందులో భాగంగా మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో పాత ఫైళ్లు, రెవెన్యూ రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు. ఎర్రవల్లి, వెంకటాపూర్, పరిసర గ్రామాలకు సంబంధించిన సర్వే నంబర్లను పరిశీలించి.. ఆయా భూముల స్వరూపం, యాజమాన్య వివరాలు, గత రికార్డులను సేకరిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ భూములు, పట్టా భూములకు సంబంధించిన వివరాలను వేర్వేరుగా పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ముఖ్యంగా ఫామ్‌హౌస్ పరిధి, దాని చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములకు సంబంధించిన రికార్డులపై అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు సంబంధించి 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందంటూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలోనే మొత్తం ఫామ్‌హౌస్ విస్తీర్ణం ఎంత.. అందులో పట్టా భూమి ఎంత.. ప్రభుత్వ, అసైన్డ్ భూమి ఏ మేరకు ఉంది అనే అంశాలను అధికారులు నిర్ధారించాలని ఆయన ఆదేశించారు. ఫామ్‌హౌస్ మొత్తం విస్తీర్ణంపై కూడా స్పష్టత తీసుకురావాలని సూచించారు.

అయితే.. ఈ ఆరోపణలు ప్రస్తుతం అధికారుల విచారణలో ఉన్న అంశాలే కాగా.. 388 ఎకరాల భూమి ఫామ్‌హౌస్‌లో భాగమైందా.. భూముల రికార్డుల్లో ఏవైనా అక్రమాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు ఉన్నాయా.. అనే విషయాలు విచారణ పూర్తయిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. భూముల ప్రస్తుత పరిస్థితితో పాటు గతంలో వాటి పరిస్థితి ఎలా ఉండేదనే విషయాన్ని తెలుసుకునేందుకు రెవెన్యూ అధికారులు టెక్నాలజీని కూడా వినియోగిస్తున్నట్లు సమాచారం. గూగుల్ ఎర్త్ వంటి శాటిలైట్ మ్యాప్‌లలోని పాత చిత్రాలను పరిశీలించి.. గతంలో భూముల వినియోగం ఎలా ఉండేది, ప్రస్తుతం ఏమైనా మార్పులు చోటుచేసుకున్నాయా అనే అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పాత రెవెన్యూ రికార్డులు, సర్వే నంబర్లు, భూముల ప్రస్తుత స్థితి, శాటిలైట్ చిత్రాలను సమన్వయం చేసి అధికారులు వాస్తవ పరిస్థితిని అంచనా వేయనున్నట్లు సమాచారం. విచారణలో భాగంగా కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే నోటీసులు జారీ చేసినట్లు అధికారికంగా నిర్ధారిత సమాచారం వెలువడే వరకు దీనిని ఖరారు చేయడం సరికాదు. అధికారులు రికార్డుల పరిశీలన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు, భూములపై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను బీఆర్ఎస్ నేతలు రాజకీయ ఆరోపణలుగా కొట్టిపారేస్తున్నారు. భూముల వివరాలను అధికారిక రికార్డులు, ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా పరిశీలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఇరు కుటుంబాల ఆస్తులపై న్యాయమూర్తి ఆధ్వర్యంలో విచారణ జరపాలని సవాల్ చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం రెవెన్యూ అధికారులు సేకరిస్తున్న రికార్డులపై ఆసక్తి నెలకొంది. ఫామ్‌హౌస్ పరిధిలోని భూముల్లో ఏవి పట్టా భూములు, ఏవి ప్రభుత్వ భూములు, ఏమైనా అసైన్డ్ భూములు ఉన్నాయా.. రికార్డుల్లో పేర్కొన్న విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి మధ్య ఏమైనా తేడా ఉందా వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. విచారణ పూర్తయిన తర్వాత అధికారులు సమర్పించే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూముల వ్యవహారం రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసే అవకాశం కనిపిస్తోంది.

# డైవర్షన్ అండ్ అటాక్ గేమ్

హైదరాబాద్, సెప్టెంబర్ 19, తెలంగాణ రాజకీయ రంగస్థలంపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వేస్తున్న రాజకీయ అడుగులు ప్రతిపక్ష భారత్ రాష్ట్ర సమితి కి పెద్ద అగ్నిపరీక్షగా మారుతున్నాయి. ప్రజా సమస్యలు, పాలనా లోపాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ ప్రయత్నించిన ప్రతిసారీ.. సీఎం రేవంత్ రెడ్డి తనదైన శైలిలో అజెండాను అకస్మాత్తుగా మార్చేసి ప్రతిపక్షాన్ని డిఫెన్స్‌లోకి నెట్టడంలో విజయం సాధిస్తున్నారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన వివాదాన్ని దళిత ఆత్మగౌరవ అంశంగా మలచడం నుంచి, 22ఎ నిషేధిత భూముల చర్చను నేరుగా కేసీఆర్ కుటుంబ భూములపై విచారణ వైపు తిప్పడం వరకు రేవంత్ వ్యూహాత్మక అజెండా పాలిటిక్స్ నడిపిస్తున్నారు. ఈ పొలిటికల్ ట్రాప్‌లో చిక్కుకుని అసెంబ్లీ సభ నుంచి కేటీఆర్ సహా ప్రధాన బీఆర్ఎస్ నాయకులు వరుసగా సస్పెండ్ కావడంతో, ప్రతిపక్షం ఫీల్డ్‌లో ఉండి శాసనసభ వేదికగా లేవనెత్తాల్సిన ప్రజా సమస్యల అజెండా మూలనపడింది. సభలో సీఎం సుదీర్ఘ ప్రసంగం చేస్తూ, రికార్డులను బహిర్గతం చేస్తూ, రెవెన్యూ విచారణలకు ఆదేశిస్తుంటే.. దానికి సభ లోపల నుంచి సమర్థవంతమైన రీ-కౌంటర్ ఇవ్వలేక బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బయట పడిపోవడం రేవంత్ రెడ్డి నైతిక విజయాన్ని ప్రతిబింబిస్తోంది. ప్రత్యర్థి వ్యూహాన్ని ముందుగా అంచనా వేసి కౌంటర్ అజెండాను సిద్ధం చేసుకోవడంలో బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకత్వం విఫలమవుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానంగా, రేవంత్ రెడ్డి ఆడుతున్న డైవర్షన్ అండ్ అటాక్ గేమ్‌ను తిప్పికొట్టడంలో కేటీఆర్, హరీష్ రావుల ప్రతిదాడి తాత్కాలిక మీడియా సమావేశాలకే పరిమితమవుతోంది. శాసనసభ వేదికపైకి రాకుండా కేవలం తెలంగాణ భవన్‌కు పరిమితమై ఇచ్చే స్పష్టతలకు, అధికారికంగా ప్రభుత్వ రికార్డుల ప్రాతిపదికన సీఎం చేసే ప్రకటనలకు మధ్య ఉన్న రాజకీయ ప్రాధాన్యతలో చాలా తేడా ఉంది. ప్రభుత్వం తమనే లక్ష్యంగా చేసుకుని విచారణల వల పన్నుతున్నప్పుడు, దానికి సమాంతరంగా ప్రజల్లోకి వెళ్లే క్రమశిక్షణతో కూడిన వ్యూహం లోపించడం వల్ల బీఆర్ఎస్ క్షేత్రస్థాయి శ్రేణులు కూడా కొంత ఆత్మరక్షణలో పడుతున్నాయి. ఇలాంటి సంక్లిష్టమైన పరిస్థితుల్లో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు స్వయంగా ఫీల్డ్‌లోకి రాక తప్పని పరిస్థితి ఏర్పడింది. కేవలం కేటీఆర్, హరీష్ రావుల పోరాటంతో రేవంత్ రెడ్డి విసురుతున్న రాజకీయ, ఆర్థిక, చట్టపరమైన బాణాలను పూర్తిగా తిప్పికొట్టడం కష్టమనే సంకేతాలు వ్యక్తమవుతున్నాయి. కేసీఆర్ స్వయంగా ప్రజల్లోకి వచ్చి , మీడియా వేదికగా రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను సమర్థవంతంగా, తనదైన మార్క్ శైలిలో తిప్పికొడితే తప్ప గులాబీ శ్రేణుల్లో మళ్లీ పాత ఉత్సాహం నింపడం సాధ్యపడదు. ఈ వ్యూహాత్మక పోరాటంలో బీఆర్ఎస్ తన విధానాన్ని తక్షణమే మార్చుకోవాల్సి ఉంది. అధికార పక్షం విసిరే వివాదాల ఉచ్చులో చిక్కుకుని అసెంబ్లీ బహిష్కరణలు, సస్పెన్షన్లకు గురికాకుండా.. రేవంత్ సర్కార్ లేవనెత్తుతున్న ప్రతి అంశానికి పక్కా రికార్డులతో సభలోనే ఎదురుదాడి చేయాల్సి ఉంది. 30 రోజుల ఎర్రవల్లి భూముల విచారణ ముగిసేలోగా బీఆర్ఎస్ గనుక రాజకీయంగా పుంజుకోకపోతే, కాంగ్రెస్ పార్టీ ఈ భూముల వివాదాన్ని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వరకు ప్రధాన ప్రచారాస్త్రంగా వాడుకునే ప్రమాదం ఉంది. తెలంగాణ రాజకీయాల్లో రేవంత్ రెడ్డి వర్సెస్ కేసీఆర్ ప్రత్యక్ష సమరానికి సమయం ఆసన్నమైంది. రేవంత్ వేస్తున్న వ్యూహాత్మక పాచికలను తిప్పికొట్టే రాజకీయ చతురత, తెలంగాణ సెంటిమెంట్ అస్త్రం కేసీఆర్ దగ్గరే ఉన్నాయి. మరి గులాబీ అధినేత ఎప్పుడు ఫామ్‌హౌస్ దాటి ప్రజాక్షేత్రంలోకి వచ్చి ఈ పొలిటికల్ నెరేటివ్‌ను తనవైపు తిప్పుకుంటారో వేచి చూడాల్సిందే.

## నవంబర్ 9న వరంగల్ ఎయిర్ పోర్టు టెక్నికల్ బిడ్..

హైదరాబాద్, సెప్టెంబర్ 19, తెలంగాణ ప్రజలకు గుడ్ న్యూస్. రాష్ట్రంలో ప్రస్తుతం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మాత్రమే అందుబాటులో ఉండగా.. రానున్న రోజుల్లో మరో ఎయిర్‌పోర్ట్ కూడా రానుంది. అదే వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్ట్. ఈ కొత్త ఎయిర్ పోర్ట్‌పై తాజాగా కీలక ముందడుగు పడింది. రూ.213.59 కోట్లతో ఎయిర్ పోర్ట్ అభివృద్ధి పనులకు టెండర్ షెడ్యూల్ ప్రకటించారు. డొమెస్టిక్ టెర్మినల్, ఏటీసీ టవర్ నిర్మాణానికి తాజాగా టెండర్లను ఆహ్వానించారు. ఇక ఫైర్ స్టేషన్, సబ్ స్టేషన్, ఈ అండ్ ఐ వర్క్ షాప్ నిర్మాణం చేయనున్నారు. 18 నెలల్లో పనులు పూర్తి చేయాలని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధన విధించింది. ఈ నెల 28వ తేదీన ఎయిర్‌పోర్టులో ప్రీ-బిడ్ సమావేశం నిర్వహించనున్నారు. అక్టోబర్ 6వ తేదీ నుంచి నవంబర్ 3వ తేదీ వరకు బిడ్ల దాఖలుకు అవకాశం కల్పించారు. నవంబర్ 9వ తేదీన టెక్నికల్ బిడ్లను తెరవనున్నారు. నవంబర్ 30న ఫైనాన్షియల్ బిడ్లను ఓపెన్ చేయనున్నారు. తాజాగా ఈ ఎయిర్ పోర్ట్ పనులపై అధికారులతో కలెక్టర్ డాక్టర్ సత్యశారద సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలపై చర్చించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే ఇప్పటికే ఈ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతులు జారీ చేసింది. రూ.496.86 కోట్ల అంచనాతో అనుమతులు ఇచ్చింది. భూసేకరణ, చట్టబద్ధమైన అనుమతులు, మౌలిక సదుపాయాల బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. దీంతో ఇప్పటికే ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయగా.. ఇప్పుడు పనుల కోసం టెండర్లను ఆహ్వానించింది. దీంతో త్వరలోనే ఎయిర్‌పోర్ట్ పనులు మొదలుకానున్నాయి. త్వరలోనే ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీని శంకుస్థాపనకు ఆహ్వానించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అటు మామునూరు ఎయిర్‌పోర్టుతో పాటు ఆదిలాబాద్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం ఎయిర్‌పోర్టుల కోసం ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి. అయితే మామునూరు ఎయిర్‌పోర్టును కాకతీయ స్టైల్లో డిజైన్ చేయనున్నారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా డిజైన్‌కు రూపకల్పన చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి



మేడ్చల్ మీర్ పెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఓఆర్ఆర్ పై శామీర్ పేట వైపు నుండి కీసర వెళుతుండగా వెనకాల నుండి కారు ను లారీ ఢీ కొట్టింది. ప్రమాదం లో అక్కడిక్కడే ఇద్దరు మృతి చెందారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రి లో మరొకరి మృతి చెందారు. ..

# వైన్ షాపు లో అగ్ని ప్రమాదం

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల కేంద్రంలోని జై భవాని వైన్స్ లో అగ్ని ప్రమాదం ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న కందుకూరు పోలీసులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది చేరుకొని శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే మంటలు దాటికి వైన్ షాప్ లో మద్యం ఇతర సామాగ్రి భారీగా దద్దమయిద్ధి తెలుస్తుంది జరిగిన ఆస్తి నష్టం ఎంత అన్నది అధికారులు పరిశీలన అనంతరం తెలుస్తుంది. అగ్ని ప్రమాదం అసలు కారణమేంటి షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందా వైన్స్ లో ఎంత మేరా నష్టం వాటిల్లింది అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు...

## కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పాలన కొనసాగిస్తుంది

## బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గౌడిచర్ల వెంకటేష్ మండిపాటు




రంగారెడ్డి రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పక్కనబెట్టి, నిరంకుశ, రాక్షస పాలన కొనసాగిస్తోందని, ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నాయకుడు గౌడిచర్ల వెంకటేష్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

మీడియా సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గౌడిచర్ల వెంకటేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగ బద్ధ పాలనను విస్మరించి, కక్షపూరిత రాజకీయం చేస్తున్నారని విమర్శించారు.

రంగారెడ్డి జిల్లా జన్వాడలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీజుకు తీసుకున్న ఫామ్హౌస్పై ప్రభుత్వం పనిగట్టుకుని వివాదాలు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రైవేటు వ్యక్తుల మధ్య జరిగిన చట్టబద్ధమైన లీజు ఒప్పందాన్ని కూడా రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుల నోళ్లు నొక్కేందుకు రేవంత్ రెడ్డి అక్రమ కేసులు, వేధింపులకు దిగుతోందని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో కక్షసాధింపు చర్యలు సరైనవి కాదని, రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకుని ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని హెచ్చరించారు. భవిష్యత్తులో కాంగ్రెస్ నిరంకుశ వైఖరికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని గౌడిచర్ల వెంకటేష్ అన్నారు.

# రంగంలోకి దిగిన అధికారులు

# ఫాంహౌస్ లెక్కలు తేల్చేస్తారా

హైదరాబాద్, సెప్టెంబర్ 19, తెలంగాణ రాజకీయాల్లో ఏళ్ల తరబడి ఒక మిస్టరీగా, అధికార కేంద్రానికి ప్రతిరూపంగా నిలిచిన సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్‌హౌస్ కాంపౌండ్ ఇప్పుడు చట్టపరమైన, పరిపాలనాపరమైన చక్రబంధంలో చిక్కుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన 30 రోజుల డెడ్‌లైన్ ప్రకటన ఊరికే కాదని నిరూపిస్తూ, రెవెన్యూ యంత్రాంగం వేగంగా ఆచరణలోకి దిగింది. మార్కూక్ తహశీల్దార్ కార్యాలయంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ నేతృత్వంలో సర్వేయర్లు, రెవెన్యూ ఉన్నతాధికారులు అత్యవసర సమీక్ష నిర్వహించి, ఫామ్‌హౌస్ పరిధిలోని పాత పహాణీలు, భూముల క్రయవిక్రయాల రికార్డులను క్షుణ్ణంగా తవ్వితీస్తున్నారు. ఈ గ్రౌండ్-లెవల్ ఆపరేషన్ అంతిమ లక్ష్యం.. ఫామ్‌హౌస్ కాంపౌండ్ వాల్ లోపల ఉన్నది కేవలం కేసీఆర్ చెబుతున్న పట్టా భూములు మాత్రమేనా లేక దళితులకు కేటాయించిన సీలింగ్, అసైన్డ్, ప్రభుత్వ కాలువల స్థలాలు ఏమైనా ఆక్రమణకు గురయ్యాయా అనే నిర్దిష్టమైన ప్రశ్నలకు చట్టబద్ధమైన సమాధానాలు రాబట్టడమే. క్షేత్రస్థాయి డిజిటల్ ల్యాండ్ సర్వే చేపట్టడానికి ముందు చట్టపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు, భూ సర్వే నిబంధనల ప్రకారం భూ యజమానులకు ముందస్తు నోటీసులు జారీ చేయడానికి అధికారులు లీగల్ కసరత్తు పూర్తి చేస్తున్నారు. అతి త్వరలోనే కేసీఆర్‌తో పాటు సంబంధిత ప్రతినిధులకు ఈ అధికారిక నోటీసులు అందనున్నట్లు సమాచారం. ఈ పరిణామం రేవంత్ రెడ్డి సర్కార్ చేపడుతున్న ఆపరేషన్‌ను కేవలం రాజకీయ విమర్శల స్థాయి నుంచి రెవెన్యూ రికవరీ స్థాయికి తీసుకెళ్లింది. శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం లెక్కలు చూపించడమే కాకుండా, నెల రోజుల గడువు పెట్టి సిద్దిపేట జిల్లా కలెక్టర్‌ను బాధ్యుడిని చేయడంతో అధికారులు ఏమాత్రం ఉపేక్షించకుండా ఫైల్స్‌ను సిద్ధం చేస్తున్నారు. సర్వే నిర్వహణ సమయానికి భూ యజమానులు లేదా వారి ప్రతినిధుల సమక్షంలోనే కొలతలు వేయాలని భావిస్తుండటంతో, ఎర్రవల్లి పరిసరాల్లో మునుపెన్నడూ ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ప్రతిపక్ష హోదాలో ఉన్న కేసీఆర్‌ను రాజకీయంగా నిరోధించలేక, కాంగ్రెస్ ప్రభుత్వం పాత కక్షలతోనే నోటీసులు, విచారణల పేరుతో హడావుడి చేస్తోందని మండిపడుతున్నాయి. గత పదేళ్లలో లేని భూ సమస్యలు ఇప్పుడు కొత్తగా ఎలా ఊడిపడ్డాయని, ఇది తమ అధినేత మనోధైర్యాన్ని దెబ్బతీసేందుకు అధికార పక్షం ఆడుతున్న కక్షసాధింపు నాటకమని విమర్శిస్తున్నాయి. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములపై బురదజల్లడం కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమేనని గులాబీ నేతలు స్పష్టం చేస్తున్నారు. 30 రోజుల కాలమితిలో రెవెన్యూ యంత్రాంగం ఇచ్చే డిజిటల్ సర్వే నివేదిక ఆధారంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి తదుపరి చర్యలకు దిగుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఆక్రమణలో ఉన్నట్లు సర్వేలో తేలితే, వాటిని స్వాధీనం చేసుకుని దళితులకు పంపిణీ చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి సవాల్ నెరవేరుతుందా లేదా ఈ వివాదం సుదీర్ఘ న్యాయపోరాటానికి దారితీస్తుందా అనేది రాబోయే కొద్ది రోజుల్లో తేలనుంది.

## వార్డు సభ్యుల ఫొరం ఇంచార్జిగా

## సొప్పరి సంతోష్ కుమార్

కమాన్ పూర్ మండలంలోని వార్డు సభ్యుల ఫోరం మండల ఇంచార్జిగా జూలపల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు సొప్పరి సంతోష్ కుమార్ ను వార్డు సభ్యుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నాగబెల్లి జ్యోతి మహేష్ ఆదేశాల మేరకు నియమించినట్లు పెద్దపల్లి జిల్లా వార్డు సభ్యుల ఫొరం ఇంచార్జి తప్పట్ల మోహన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా సొప్పరి సంతోష్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని వార్డుల్లో నెలకున్న సమస్యలు - వాటి పరిష్కారం దిశగా ముందు ఉండేది వార్డు సభ్యులు మాత్రమే అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వార్డుల్లో సమస్యలు పరిష్కారం అయితేనే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. వార్డుల స్థాయి నుండే గ్రామం.. మండలం.. జిల్లా.. రాష్ట్రం.. దేశం.. ఇలా ప్రగతి పథంలో ముందుకు సాగుతేనే.. దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. పల్లెల ప్రగతిలో వార్డు సభ్యుల పాత్ర క్రియాశీలకమన్నారు. తన పై ఎంతో నమ్మకంతో కమాన్ పూర్ మండల వార్డు సభ్యుల ఫోరం ఇంచార్జిగా అపోగించిన బాధ్యతలకు న్యాయం చేసే విధంగా.. వార్డు సభ్యులకు గౌరవమైన హోదా.. హక్కుల సాధన కోసం కృషి చేస్తానని వెల్లడించారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# క్రాంతి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆద్వర్యం లో ఘనంగా వినాయక నవరాత్రి మహోత్సవాలు



సికింద్రాబాద్ సెప్టెంబర్ 19: సికింద్రాబాద్లోని వారసింగూడ లోని క్రాంతి ఫ్రెండ్స్ అసోసియేషన్ 48వ వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్విహిస్తున్నారు. శుక్రవారం స్థానిక బిజెపి నాయకులు రాచమల్ల కృష్ణ మూర్తి ఆద్వర్యం లో పూజ కార్యక్రమాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఘనంగా వినాయక పూజ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా నిర్వాహకులు పుప్పాల శ్రీనివాస్,రాచమల్ల కృష్ణ మూర్తి లు ఎక్స్ ప్రెస్ న్యూస్ ఏజెన్సీ మీడియా ఎం.డి డాక్టర్ మహేశుని లక్ష్మయ్య నేత,బిజెపి సీనియర్ నాయకు లు ప్రసాద్, గణేష్ ,డాక్టర్ చిక్కా దేవదాసు గ్రేటర్ వారసుగూడ పద్మశాలి సంఘం గౌరవ సలహాదారులు బొమ్మ నరేందర్, అధ్యక్షులు గోలి జనార్ధన్, విశ్వ ఈవెంట్స్ హరినాథ్, పెండెం సంతోష్,లను ఘనంగా సత్కరించారు. అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.



# కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య నడుస్తున్నది డబ్ల్యూడబ్ల్యూఎఫ్ తరహా ఫ్రెండ్లీ ఫైట్

**డైవర్షన్, డిస్ట్రక్షన్, డిమాలిషన్ మాత్రమే రేవంత్ రెడ్డి పాలసీ**

**అసెంబ్లీని కాంగ్రెస్ 'మాకరీ' చేస్తే.. బీఆర్ఎస్ 'మాక్ అసెంబ్లీ'కి పరిమితమైంది.**

**కేసీఆర్ కుటుంబ ఆస్తులపై విచారణ పేరుతో 'బీటింగ్ అరౌండ్ ది బుష్' డ్రామాలు..**

**ఇబ్రహీంపట్నంలో రూ. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూముల అక్రమ బదలాయింపు..**

**బీజేపీ అధికారంలోకి రాగానే భూ కబ్జాలపై ఈడీ, సీబీఐ విచారణలు తప్పవు.**

**తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య జరుగుతున్న రగడ అంతా నాటకం**

**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్**

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**

హైద్రాబాద్ సెప్టెంబర్ 19 :తెలంగాణ గ్రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య జరుగుతున్న రగడ అంతా నాటకమని, ప్రజలను మభ్యపెట్టేందుకు డబ్ల్యూడబ్ల్యూఎఫ్ (ఔఔఫ్) తరహాలో ఫిక్స్ మ్యాచ్లు ఆడుతున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాల ఎనిమిది నెలలు కావస్తున్నా, ఆయన నమ్ముకున్న ఏకైక సూత్రం 'డైవర్షన్, డిస్ట్రక్షన్, డిమాలిషన్' అని డాక్టర్ బూర విమర్శించారు. అసెంబ్లీలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీల అమలుపై గానీ, 22ఏ నిషేధిత జాబితాలో కోటి ఎకరాలు పెట్టి పేద పట్టాదారులను వేధిస్తున్న విధానంపై గానీ ఎలాంటి చర్చ జరగకుండా ప్రభుత్వం తప్పించుకుంటోందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ మీడియా సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి , శ్రీధర్ రెడ్డి ప్రకాష్ రెడ్డి గ శ్రీధర్ , బాలేష్ , తదితరులు పాల్గొన్నారు..



ఈ సందర్భంగా.. బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ.. గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు గారు, బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో.. పార్టీ శ్రేణులు హిల్ట్ (ఎ×ూ) పాలసీ కుంభకోణం, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు, కరెంట్ కోతలు, ఎల్ఐసీ, పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేస్తుంటే.. వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ అసెంబ్లీని ఒక అపహాస్యం (వీశీఙవతీఎ)గా మార్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ సభను మాకరీ చేస్తే, ప్రతిపక్ష బీఆర్ఎస్ కేవలం మాక్ అసెంబ్లీలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. 'మేము కొట్టినట్లు చేస్తాం.. మీరు ఏడ్చినట్లు నటించండి' అన్న రీతిలో ఉభయ పార్టీలు క్లాస్ రూమ్ తరహా రాజకీయాలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని ఆరోపించారు.

ప్రజా సమస్యలపై కేంద్రమంత్రులు జి. కిషన్ రెడ్డి గారు, బండి సంజయ్ కుమార్ గారు, బీజేపీ శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు నిలదీస్తుంటే సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నేతలు అసహనానికి గురవుతున్నారని పేర్కొన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సభ్యత, సంస్కారం మరిచి బీజేపీ నాయకులపై, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గారిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ.. ఆ వ్యాఖ్యలు శోచనీయమన్నారు. చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎంపీ హోదా కంటే సీఎం పీఆర్వో తరహాలోనే వ్యవహరిస్తున్నారని, గెలిచి ఇన్నేళ్లయినా భువనగిరి నియోజకవర్గానికి ఆయన చేసిన అభివృద్ధి ఏమీ లేదని, ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడి బీఆర్ఎస్ను గద్దె దించింది ఆనాటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ గారి నేతృత్వంలోని బీజేపీయేనని, ఆ పోరాట ఫలితంగానే రేవంత్ రెడ్డి సీఎం అయ్యారనే నిజాన్ని మరిచిపోవద్దని గుర్తుచేశారు.

కేసీఆర్ ఫామ్హౌస్, హరీష్ రావు సిద్దిపేట ఇళ్ల చుట్టూ మంత్రులు, ఎమ్మెల్యేలు ఆర్టీసీ బస్సుల్లో వెళ్లడం ఒక పొలిటికల్ పిక్నిక్ లాగా మారిందే తప్ప, చట్టపరమైన చర్యలు శూన్యమని బూర నర్సయ్య గౌడ్ గారు విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ ఫామ్హౌస్లో వందల ఎకరాల అక్రమ భూములు ఉన్నాయని లైవ్ పెట్టి చెప్పిన ముఖ్యమంత్రి.. నేడు ఫామ్హౌస్ లోపలికి వెళ్లి సర్వే చేయించే దమ్ములేక 'బీటింగ్ అరౌండ్ ది బుష్' చందంగా చుట్టుపక్కల సర్వేలు చేయిస్తూ నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. గుండెపోటు వస్తే అపెండిక్స్ రంగారెడ్డి జిల్లాలో భూదందాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, రంగారెడ్డి జిల్లా పేరును రేవంత్ రెడ్డి జిల్లాగా, ఇబ్రహీంపట్నం పేరును 'అనుములపట్నం'గా మార్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. గతంలో ఫార్మా సిటీ, ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ, రేడియల్ రోడ్ల పేరుతో దాదాపు 50 వేల ఎకరాల మేర వక్ఫ్, అసైన్డ్, ఎవాక్యూ ల్యాండ్స్ను కాగితపు కంపెనీల ముసుగులో కాజేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. నిర్దిష్టంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మునగనూరు గ్రామంలో నిజాం కాలం నాటి సర్వే నెంబర్ 44/1, 44/10లలోని రూ. 300 కోట్ల విలువైన 12 ఎకరాల ప్రభుత్వ భూమిని రాత్రికి రాత్రే గోపాల్ అనే వ్యక్తి పేరిట ప్రైవేటు భూమిగా బదలాయించారని ఆధారాలతో సహా పేర్కొన్నారు. ఈ భూదందాల వెనుక అనుముల బ్రదర్స్, చామల బ్రదర్స్ ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు.

గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన ప్రతి భూదందాపై లెక్క తేలుస్తామని, తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా భూమి ఎక్కడికీ పోదని, అక్రమంగా మార్చిన పట్టాలు, ప్రొహిబిషన్ లిస్టులన్నింటినీ రద్దు చేసి పేదలకు, ప్రభుత్వానికి చెందేలా చేస్తామని స్పష్టం చేశారు. భూ కబ్జాలకు పాల్పడ్డ ప్రతి ఒక్కరిపై సీఐడీ, ఈడీ, సీబీఐ విచారణలు చేయించి జైలుకు పంపడం ఖాయమని హెచ్చరిస్తూ, రాజకీయాల్లో మాట్లాడేటప్పుడు కాంగ్రెస్ నేతలు సభ్యతతో

ఆపరేషన్ చేసిన చందంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని, అనుముల కుటుంబం-- కల్వకుంట్ల కుటుంబం మధ్య జరుగుతున్నది పరిపాలనా బదిలీ మాత్రమే కాదని, ఆస్తుల బదిలీ అని ఆరోపించారు. నిజాయితీ ఉంటే క్రిమినల్ కేసులు ఎందుకు పెట్టలేదని, పీఎంఎల్ఏ (గ్రామీూా) చట్టం కింద అక్రమ నగదు లావాదేవీలపై విచారణ ఎందుకు కోరడం లేదని నిలదీశారు.

# మహస్థపతి సిరిలూత గ్రంథాల ఆవిష్కరణ

## శిల్పిసిరిలుత నాటి కాలపు చరిత్రను దృశ్యం ఆచార్య కొలకలూరి ఇనాక్

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**

హైద్రాబాద్ సెప్టెంబర్ 19: సమాజానికి చారిత్రిక పద్య నాటకం ద్వారా అందించిన టి వి స్వామి ధన్యులు..వారు చక్కని అంశాన్ని శిల్పిసిరిలుతను నాటి కాలపు చరిత్రను దృశ్యం గా ను అందించారు వారికి అభినందనలు అని ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు



శ్రీ మానస ఆర్ట్స్ థియేటర్స్ శ్రీ కృష్ణ దేవరాయ భాషా నిలయం సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత తిరుమల వెంకట స్వామి రచించిన మహస్థపతి సిరిలూత గ్రంథాల ఆవిష్కరణ, అంకితిత్సవ సభ ఘనంగా జరిగింది ... ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా పద్మ శ్రీ అవార్డెగ్రహిత ఆచార్య కొలకలూరి ఇనాక్ మహస్థపతి సిరిలూత ,కిన్నర ఆర్ట్స్ థియేటర్స్ కార్యదర్శి మద్దాలి రఘురామ్ అమెరికాలో నా అనుభవాలు గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు.. ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ చారిత్రిక నాటకాలు జాతి కరదీపికలనే,అందునా స్ఫూర్తి నిచ్చే రచనలు వెలుగు చూడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని మంచి నాటకాన్ని సరళసుందర దృశ్య కావ్యంగా అందించిన టి వి స్వామి అభినందనీయుడని అన్నారు



మద్దాల రఘురామ్ మాట్లాడుతూ చక్కని సినిమా స్క్రీన్ పే లాగా సరళంగా రచించిన నాటిక యువతరానికి అదృశ్యనీయమని అన్నారు

నమో నమో ప్రియ భారత మాత ఆడియో ను ఆవిష్కరించారురచయిత తన గ్రంథాలను ప్రముఖ సాహితీవేత్త దూరదర్శన్ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అనంత పద్మనాభ రావు కి మహా స్థపతి సిరిలుత, నేటి నిజం పత్రిక సంపాదకులు బైసా దేవదాస్ గారికి అమెరికా నా అనుభవాలు అంకితం ఇచ్చి ఘనంగా సత్కరించారు. సభ కు ప్రముఖ సాహితీవేత్త ,పూర్వ రిజిస్టర్ తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్య టి గౌరీ శంకర్ అధ్యక్షతవహించరు.. మద్దాల రఘురామ్,ఉమ్మడి సింగ్ రాఘవ రావులు పుస్తకాలను సమీక్షించారు

మానస కార్యదర్శి రఘు శ్రీ, మిద్దె సురేష్ సభ సమన్వయం గావించారు

సభకు ముందు మిద్దె సురేష్ ఆధ్వర్యం లో కవి సమ్మేళనం నిర్వహించారు

## గణేష్ ఉత్సవాలు, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

# గణేష్ మండపాలను సందర్శించిన ఖని ఏసీపీ

గోదావరిఖని గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ మండపాలను గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సీఐ కృష్ణకుమార్తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ నిర్వాహకులతో మాట్లాడి, ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనంతరం ఏసీపీ ఎం.రమేష్ మాట్లాడుతూ, 23-09-2026 బుధవారం నిర్వహించనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్రలో నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిర్వాహకులకు ముఖ్య సూచనలు నిమజ్జన శోభాయాత్రలో పోలీసులు సూచించిన మార్గం, సమయాలను తప్పనిసరిగా పాటించాలి. శోభాయాత్ర సందర్భంగా ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. డీజేలకు అనుమతి లేదు. నిబంధనలకు అనుగుణంగా మాత్రమే సౌండ్ సిస్టమ్ను వినియోగించాలి. సౌండ్ సిస్టమ్ వినియోగంలో నిర్దేశిత సమయ పరిమితులను తప్పనిసరిగా పాటించాలి.. శోభాయాత్రలో అశ్లీల, రెచ్చగొట్టే పాటలు లేదా నినాదాలు చేయరాదు. గణేష్ మండపాలు, శోభాయాత్ర జరిగే ప్రాంతాల్లో విద్యుత్ భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలి.. శోభాయాత్రలో పాల్గొనే యువత మద్యం సేవించి పాల్గొనరాదు. గణేష్ విగ్రహాలను తరలించే వాహనాలపై అధిక సంఖ్యలో వ్యక్తులు,చిన్న పిల్లలు ఎక్కకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి. నిమజ్జనం సందర్భంగా పోలీసులు, ఇతర శాఖల సిబ్బందికి నిర్వాహకులు పూర్తిగా సహకరించాలి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే లేదా అవాంఛనీయ ఘటనలకు దారితీసే చర్యలకు పాల్పడకుండా సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించాలి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా గణేష్ ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఏసీపీ ఎం.రమేష్ కోరారు.

# ఘనంగా గూడెం మహిపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**

హైదరాబాద్ సెప్టెంబర్ 19:పటాన్చెరు ఎం ఎల్ ఎ గూడెం మహిపాల్ రెడ్డి జన్మదినం సందర్భంగా జె ఎసి ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ దస్తగిరి (చోటు) ఆధ్వర్యంలో పటాన్చెరు ఆటో స్టాండ్ వద్ద జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు..ఈ సందర్భంగా దస్తగిరి(చోటు) మాట్లాడుతూ మహిపాల్ రెడ్డి ఆయురాగ్యాలతో,సుఖసంతోషాలతో ఉండాలని రాబోయే రోజుల్లో మినిస్టర్ గా ప్రజల మద్యలోకి రావాలని ఆయన కోసం ఆటో యూనియన్ తరపున పూర్తిగా శ్రమించి అన్న గెలుపుకు కృషిచేస్తామని అన్నారు..పేద ప్రజలకు అండగా ఉంటూ పటాన్చెరు ప్రజలను సొంత మనుషుల్లా చూసుకుంటున్నారని ఆయన నిండు నూరేళ్ళు సంతోషంగా ఉండాలని భగవంతుణ్ణి కోరారు..ఈ కార్యక్రమంలో రమేష్,సాదిక్,జార్జ్,దత్తు,రాజు నాయక్,అక్బర్,రఫీక్, గోపి సింగ్,లక్ష్మణ్, బాబు రావు,అఫ్సర్,దత్తు రామ్ తదితరులు పాల్గొన్నారు..



# విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే కష్టంతో కాదు ఇష్టం తో చదవాలి. డాక్టర్ రియాజ్

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ .
















**ప్రజాబలం, సెప్టెంబర్ 19 మహబూబాబాద్**ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మహబూబాబాద్ లో ఈరోజు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థినులకు ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీ పొక్కుల సదానందం అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక అడ్మిషన్లు తో పాటు అత్యధిక ఫలితాలను కూడా సాధిస్తున్న ఏకైక బాలికల కళాశాలని కళాశాల విద్యార్థులు క్రమశిక్షణతో ప్రతిరోజు హాజరు కావడం వల్ల అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని తెలియజేస్తూ అధ్యాపక బృందం ప్రతిరోజు విద్యార్థులకు తరగతులు బోధిస్తూ, ఎంసెట్ క్లాసు బోధిస్తూ ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వారి లెసన్స్ ఐ ఎఫ్ ఎల్ ఫైనల్ ద్వారా బోధిస్తూ వారిని ఒక మంచి మార్గంలో పయనించే విధంగా దిక్సూచి చేస్తున్నారని ఈ సంవత్సరం కూడా ఫలితాల్లో ప్రథమ స్థాయిలో ర్యాంక్ సాధించే విధంగా కృషి చేస్తామని ఆ విధంగా విద్యా ప్రణాళికను రూపొందించుకొని ముందుకెళ్తున్నామని తెలియజేశారు .ఈ సంవత్సరం ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న అనేక సౌకర్యాలు సదుపాయాలు యూనిఫార్మ్ కాలేజ్ బ్యాగ్, షూ స్, టెక్స్ట్ బుక్స్, నోట్స్ బుక్స్ తో పాటు భవిష్యత్తులో అల్పాహారం అందించే అవకాశం ఉంది కాబట్టి ఈ అవకాశాలను అందిపుచ్చుకొని బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ గారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని దానికోసం ఇప్పటినుంచి కష్టంగా కష్టంతో కాకుండా ఇష్టంతోనే ప్రయత్నం చేసినట్లయితే కచ్చితంగా అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని ఇప్పటి యువత సెల్ ఫోన్ సెల్ ఫోన్ మత్తులో పడి విలువైన జ్ఞానాన్ని ఆర్జించే సమయాన్ని వృధా చేసుకుంటున్నారని సెల్ ఫోన్ జ్ఞానం కోసం వినియోగించుకోవాలని, విజేతలుగా నిలిచిన ప్రతి ఒక్కరూ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ధైర్యంగా ముందుకు సాగినవారని వారిని ఆదర్శంగా తీసుకొని వారు సూచించే సూచనలు ఆచరించి భవిష్యత్తు పొందాలని తెలియజేశారు

లక్ష్యసాధనలో ఒకసారి అపజయం పొందినప్పుడు ఎట్టి పరిస్థితుల్లో కృంగిపోవద్దని, ధైర్యంతో ముందుకు దూసుకెల్లడమే విజయానికి సోపానమని, జీవితంలో ఆటుపోట్లు సహజమని వాటిని ఎదుర్కొని ముందుకెళ్లేవాడే విజేతగా నిలుస్తాడని అదేవిధంగా ఇంటర్మీడియట్ స్థాయి నుంచి మన సాధించాలనుకున్న లక్ష్యాన్ని ప్రణాళిక బద్ధంగా చదవాలని ఏ జాబ్ అయితే చేయాలని సంకల్పం చేసుకుంటాము ఆ ఉద్యోగం కోసం అవసరమైన విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను సలహాలు సూచనలు ఇచ్చే గురువులను తరచూ కలిసి అవసరమైన జ్ఞానాన్ని పొందాలని సూచించారు.

మహబూబాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీ మదర్ గౌడు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను పొందడమే కాకుండా ఈ కళాశాలలో ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందం ఒక క్రమశిక్షణమైన విద్య విలువలను కలిగి ఉండి విద్యార్థులకు అనునిత్యం అందుబాటులో ఉండటం వల్ల అడ్మిషన్లు కానీ ఫలితాలు కానీ చాలా ఉత్తమంగా ఉన్నాయని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడానికి కళాశాల ప్రిన్సిపాల్ సదానందం గారు చేస్తున్న కృషి అద్భుతమని విద్యార్థులందరూ ఈ కళాశాలలో చేరడం వారు చేసుకున్న అదృష్టమని అలాగే మంచిగా ఉన్నత స్థితిలో నిలవాలని సూచించారు

అతిథిగా విచ్చేసిన డాక్టర్ పొక్కుల సంస్కృతి మాట్లాడుతూ గర్ల్స్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులందరూ కూడా ఉన్నత స్థాయిలో ఉండాలని, దానికోసం ఆడవాళ్ళం మనమేం చేస్తాం అని ఆలోచించకుండా, ఆడవాళ్ళం కాబట్టి ఏదైనా సాధించగలం అనే పట్టుదలతో ముందుకెళ్లాలని సూచించారు. మన నాన్న మన గురించి మాత్రమే ఆలోచిస్తారు కానీ కళాశాల ప్రిన్సిపాల్ గారు మాత్రం కళాశాలలో ఉండబడే అందరి ఆడపిల్లల గురించి ఆలోచిస్తారు కాబట్టి మీరు ధైర్యంగా ఈ కళాశాలలో అడ్మిషన్ తీసుకున్నారు కాబట్టి తల్లిదండ్రుల తర్వాత ఇక్కడి అధ్యాపకుల మంచి బోధనతో మీరు ఉత్తమ విద్యార్థులు తయారు కావాలని సూచించారు.

ఇంకా ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ వివి నాగేందర్ పెండ్లి అశోక్ 11వ వార్డు కౌన్సిలర్ బోడ రవి, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చొప్పరి శ్రీనివాస్, సీనియర్ అధ్యాపకులు సాదిక్ అలీ, పర్వీన్ బేగం, రవికిరణ్, నవీన్ కుమార్,రియాజ్, స్వాతి, భార్గవి, కిరణ్, స్వరూప, సృజన, పూర్ణిమ,రవి భాగ్యలక్ష్మి లక్ష్మీ ఉమా అక్షర ప్రభాకర్ నవోదయ వెంకన్న మహమ్మద్ భాష జానీ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం విద్యార్థినిల సాంస్కృతి కార్యక్రమాలు చాలా ఉత్సవ భరీతంగా, ఆహ్లాదకరంగా అందరినీ ఆకట్టుకోవడం జరిగింది.

# తెలంగాణ రక్షణ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా శ్రీ పురం మహేందర్ రెడ్డి నియమితం



హైద్రాబాద్ సెప్టెంబర్ 19:తెలంగాణ రక్షణ సేన (టిఆర్ ఎస్) రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా శ్రీ పురం మహేందర్ రెడ్డి నియమితు లైనందుకుమహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ కోలా శ్రీనివాస్ నియోజకవర్గం తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు.

తెలంగాణ రక్షణ సేన వ్యవస్థకు అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక్క, మహేందర్ రెడ్డి గతంలో చేసిన సేవలను, వారు చేస్తున్న కార్యక్రమాలను, ప్రజల్లో వారికి ఉన్న విశేష ఆదరణను గుర్తించి ఈ బాధ్యతను అప్పగించారు."అన్నా" అంటే "నేనున్నా" అని ప్రతి ఒక్కరిని పలకరిస్తూ, అందరికీ అందుబాటులో ఉంటూ, ఎవరికి ఆపద వచ్చినా వెంటనే నేనున్నానని భరోసా ఇస్తూ, అందరి మనిషిగా, అందరివాడిగా ఉంటున్న మహేందర్ అన్నకు ఇంత పెద్ద బాధ్యతను అప్పగించినందుకు కల్వకుంట్ల కవితక్క కు మహేశ్వరం నియోజకవర్గం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.మహేందర్ రెడ్డి గారి నాయకత్వంలో రంగారెడ్డి జిల్లాలో తెలంగాణ రక్షణ సేన మరింత బలోపేతం అవుతుందని ఆకాంక్షిస్తున్నాము.

## బౌద్ధ నగర్ వీ.ఎం టవర్స్ లో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు



**సికింద్రాబాద్ సెప్టెంబర్19:** సికింద్రాబాద్ నియోజకవర్గం లోని బౌద్ధ నగర్ డివిజన్ లో గల వీ.ఎం టవర్స్ లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు ఇందులో భాగంగా ఆరవ రోజు ఘనంగా పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా బౌద్ధనగర్ సిఐ విఎం టవర్స్ లో గల గణేష్ మండపాన్ని సందర్శించి పూజలు జరిపారు ఈ సందర్భంగా వీఎం టవర్స్ అధ్యక్షురాలు వల్ల గీత నేత సిఐని శాలువాతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా బల్ల గీత మాట్లాడుతూ ప్రతి ఏటా మా టవర్స్ లో గణేశున్ని ఏర్పాటు చేసి ఐకమత్యతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటూ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.


# పిడుగుపాటుకు ఇద్దరు రైతులు బలి

## వేంసూరు, కల్లూరు మండలాల్లో విషాదం..

## కుటుంబాలకు తీరని శోకం

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 19:** ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. వేంసూరు మండలం లచ్చన్నగూడెంలో పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లిన రైతు పిడుగుపాటుకు మృతి చెందగా, కల్లూరు మండలం పాత యర్రబోయినపల్లిలో పొలంలో కలుపు తీస్తున్న మహిళ పిడుగుపాటుకు బలైంది.





**పొలంలోనే రైతు దుర్మరణం:**

వేంసూరు మండలం లచ్చన్నగూడెం గ్రామానికి చెందిన పర్స ఆనందరావు (52), తండ్రి అంజయ్య, వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం పొలంలో దుక్కి దున్నేందుకు వెళ్లిన సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం పడుతుండగా ఆనందరావుపై పిడుగు పడింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆనందరావుకు భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురికీ ఇంకా వివాహాలు కాలేదు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న ఆనందరావు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**కల్లూరులో మహిళ మృతి:**

కల్లూరు మండల పరిధిలోని పాత యర్రబోయినపల్లి గ్రామానికి చెందిన నల్లగట్ల జమాయమ్మ (50) పొలంలో కలుపు తీస్తుండగా శనివారం అకస్మాత్తుగా పిడుగు పడింది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా, మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు తెలిపారు.

ఒకే రోజు రెండు మండలాల్లో పిడుగుపాట్లకు ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో ఆయా గ్రామాల్లో విషాదం అలుముకుంది. పొలాల్లో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు వర్షాలు, ఉరుములు, మెరుపుల సమయంలో అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.

## పీఎం స్వానిధి పథకాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి... పీడీ

ఆళ్లగడ్డ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఖఓ స్వానిధి పథకాన్ని ప్రజలలోకి విరివిగా తీసుకొని వెళ్లి చిన్న చిన్న వ్యాపారస్తులు ఈ రుణాలను సద్వినియోగం చేసుకునేలా మెప్మా మహిళలు ప్రోత్సహించాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట దాసు విజ్ఞప్తి చేశారు. ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన మెప్మా మహిళల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలలోని వీధి వ్యాపారులకు ఎలాంటి పూచికత్తు లేకుండా ఈ పథకం ద్వారా రూ 15 వేల వరకు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మెప్మా అఓఓ సుజాత, సి ఓ శిరీష రాణి, మేనేజర్ ఆనంద్, డిఆర్పీలు వేమారెడ్డి వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడిలోకి చేరిన బొజ్జ గణపయ్య



జియాగూడ : గంగమ్మ ఒడిలోకి బయలుదేరిన గణపయ్య సంజయ్ నగర్ లోని మండపంలో కొలువుతీరిన గణపయ్యను ప్రజాఏక్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నర్సింగ్ రావు ఉలుకుందాకర్, రాజేందర్, జియాగూడ డివిజన్ మహిళ అధ్యక్షురాలు భారతి బాయ్ విలక్ష్మీ ప్రసన్న, వి నవనీత విజయశ్రీ పి తేజస్విని భార్గవి ప్రియ మేఘన జియాగూడ డివిజన్ యూత్ అధ్యక్షులు శ్రియాన్స్ చంద్ర ధనుష్ కుమార్ సాత్విక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు

# పుప్పాలగూడలో గణేష్ కుమార్ కు సన్మానం



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 19 సెప్టెంబర్ 2026** పుప్పాలగూడ గ్రామ పరిధిలోని సంతోష్ నగర్ కాలనీ అసోసియేషన్ ద్వారా బాబు జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాలులో హరీ ఓం గజానన్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన వినాయక మండప కార్యవర్గ సభ్యులు – ఎస్ ప్రశాంత్, విశ్వనాథ్, మనోహర్, ప్రవీణ్ కుమార్, వినోద్, జనార్ధన్ తదితరులు కలసి కట్టుగా స్థానిక బి ఆర్ ఎస్ పార్టీ నాయకుడు, సంఘ సేవకుడు సింగదాసరి గణేష్ కుమార్ ద్వారా వినాయకుడి పూజానంతరమ్ దుశ్శలువాతో ఘనంగా సన్మానించడం జరిగినది.

# లతీఫ్ రోడ్డు విస్తరణకు ఆక్రమణల తొలగింపు



**జహీరాబాద్, సెప్టెంబర్ 19 ప్రజాబలం ప్రతినిధి:** పట్టణంలోని లతీఫ్ రోడ్డు విస్తరణకు మార్గం సుగమం కానుంది. రహదారి వెంబడి ఉన్న ఆక్రమణలను ఈ నెల 21వ తేదీలోగా స్వచ్ఛందంగా తొలగిస్తామని ఆక్రమణదారులు మున్సిపల్ అధికారులకు హామీ ఇచ్చారు. దీంతో లతీఫ్ రోడ్డును 40 అడుగుల వెడల్పునకు విస్తరించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. రోడ్డు విస్తరణ పూర్తయితే ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు మరింత సౌకర్యం కలగడంతోపాటు ట్రాఫిక్ సమస్య కొంతమేర తగ్గే అవకాశం ఉంది. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారిని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆక్రమణల తొలగింపు, రోడ్డు విస్తరణ పనులకు వ్యాపారులు, స్థానికులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ కోరారు. నిర్ణయించిన గడువులోగా ఆక్రమణలను తొలగించి రహదారి విస్తరణకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జాంగిర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# లిటిల్ కడిల్స్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్ చిన్నారులు అగ్నిమాపక కేంద్ర సందర్శన.





**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 19 సెప్టెంబర్ 2026**నార్సింగి మున్సిపల్ సర్కిల్ పరిధిలోనీ నెక్నంపూర్ డివిజన్ పుప్పలగూడ బాలాజీ నగర్లో గల లిటిల్ కడిల్స్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్ చిన్నారి విద్యార్థులు అవగాహన కార్యక్రమం సందర్భంగా అగ్నిమాపక కేంద్ర సందర్శన సందర్శించారు.ఈ విద్యా విషయక క్షేత్ర పర్యటనలో భాగంగా, సమాజ రక్షణలో అగ్నిమాపక సిబ్బంది పోషిస్తున్న కీలక పాత్రను మరియు అత్యవసర సమయాల్లో వారు ప్రదర్శించే సాహసాలను చిన్నారులు ప్రత్యక్షంగా చూసి తెలుసు కున్నారు. చిన్నతనంలోనే విద్యార్థులకు అగ్నిప్రమాదాల పట్ల అవగాహన, సురక్షిత చర్యలపై స్పష్టత కల్పించడంలో ఫైర్ స్టేషన్ అధికారులు చూపిన చొరవ మరియు వారి ఆప్యాయత ఎంతో ప్రశంసనీయం. పిల్లల పట్ల ఎంతో ఓపికతో వ్యవహరిస్తూ, ఫైర్ ఇంజిన్ పనితీరు మరియు భద్రతా నియమాలను సులభ శైలిలో వివరించి వారిలో స్ఫూర్తిని నింపి, చిన్నారులకు అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫైర్ ఇంజిన్ పనిచేసే విధానం మరియు అత్యవసర సేవల ప్రాముఖ్యతను ఎంతో ఓపికగా వివరించారు. విద్యార్థులకు ఆప్యాయంగా అవగాహన కల్పించి, వారిని ఎంతో ఆదరించిన అగ్నిమాపక కేంద్ర అధికారికి మరియు సిబ్బంది అందరికీ లంగర్ హౌస్ ఫైర్ స్టేషన్ అధికారి సంతోష్ కుమార్, మహేష్, తాహిర్ అలీ ఖాన్, కోమల్, కమలేశ, విజయ్, రవి తదితరులకు పాఠశాల ప్రిన్సిపాల్ హర్షిత సక్సేనా, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## రైతులచే క్షేత్ర ప్రదర్శన:

రామడుగు మండలం లోని గోపాలరావుపేట దత్తోజిపేట కొరటపల్లి గ్రామాలలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో వివిధ రైతులచే క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించుటలో భాగంగా వరి లో సన్నరకాల సాగు పంట మార్పిడి విధానం లో కంది పసుపు పంట సాగు చేపట్టడం జరిగిందన్నారు.ఈ క్షేత్రాలు చొప్పదండి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీమతి ప్రియదర్శిని సందర్శించి తగిన సూచనలు ఇచ్చారని రామడుగు మండల వ్యవసాయ అధికారిని ప్రభావతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీమతి ప్రభావతి ఆత్మ బిటిఎం స్రవంతి ఎటిఎం సుమాంజలి ఏఈఓ అనంతరాజ్ రైతులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్‌లో మైత్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఘనంగా మహా అన్నప్రసాద వితరణ



**మహబూబాబాద్, సెప్టెంబర్ 19,** గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మైత్రి హాస్పిటల్లో డాక్టర్ బాలు నాయక్, డాక్టర్ సుచిత్రల ఆధ్వర్యంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. గత ఐదు రోజులుగా స్వామివారికి నిత్య పూజలు జరిపిన నిర్వాహకులు, నిమజ్జనోత్సవం సందర్భంగా మైత్రి హాస్పిటల్ ఆవరణలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.?ఈ సందర్భంగా డాక్టర్ బాలు



నాయక్, డాక్టర్ సుచిత్ర దంపతులు మాట్లాడుతూ---గణనాథుని దివ్య ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతినే పూజించాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల జరిగే కాలుష్యాన్ని అరికట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి ఏటా తమ హాస్పిటల్ నందు మట్టి వినాయకుడిని ప్రతిష్టించి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.?ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ వీరన్న, డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ రమేష్, డాక్టర్ జగన్మోహన్ రెడ్డి, డాక్టర్ రాంరెడ్డిలతో పాటు మైత్రి హాస్పిటల్ సిబ్బంది, స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన ఉద్ధృతం

## కళాశాలకు తాళం..

## అధ్యాపకులను అడ్డుకున్న విద్యార్థులు

**జహీరాబాద్, సెప్టెంబర్ 19 ప్రజాబలం ప్రతినిధి:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే ప్రతిపాదనను విరమించుకోవాలని, ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రంజోల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఆందోళన శనివారం ఉద్ధృతమైంది. 36 రోజులుగా వివిధ రూపాల్లో నిరసనలు కొనసాగిస్తున్న విద్యార్థులు..






శనివారం కళాశాలకు తాళం వేసి అధ్యాపకులను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను నిర్వీర్యం చేస్తూ కొత్త జీవోల పేరుతో ప్రైవేటీకరణకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విద్యార్థులు ఆరోపించారు. జీవో 97ను వెంటనే రద్దు చేసి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రస్తుతం కొనసాగుతున్న విధానంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కళాశాల ప్రాంగణంలో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

సెమిస్టర్ పరీక్షల బహిష్కరణ

విలీన ప్రతిపాదన, జీవో 97కు వ్యతిరేకంగా విద్యార్థులు ప్రస్తుతం జరుగుతున్న సెమిస్టర్ పరీక్షలను బహిష్కరించారు. పరీక్షలు రాయాలని అధ్యాపకులు విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వారు అంగీకరించలేదు. తమ ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు పరీక్షలకు హాజరుకాబోమని తేల్చిచెప్పారు. పరీక్షలను బహిష్కరిస్తూ కళాశాల ప్రాంగణంలోనే ఆందోళన కొనసాగించారు.

నల్ల బ్యాడ్జీలతో అధ్యాపకుల సంఘీభావం

విద్యార్థుల ఆందోళనకు అధ్యాపకులు కూడా సంఘీభావం తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యథావిధిగా కొనసాగించాలని, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. జీవో 97ను రద్దు చేయకపోతే ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

# బల్కంపేట్ లో రైసింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథుడి ప్రతిష్ట



**అమీర్పేట్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) సెప్టెంబర్ 19** బల్కంపేట్ లో శేఖర్ అప్ప రేషన్ షాప్ వద్ద రైసింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథుడిని నెలకొల్పారు.భక్తి శ్రద్ధలతో గణపతి పూజలు నిర్వహిస్తూ, స్థానిక భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

## స్వల్ప వర్షానికే రంజోల్ ప్రధాన రహదారి జలమయం

### శాశ్వత డ్రైనేజీ ఏర్పాటు చేయాలి: రమేష్‌రెడ్డి



**జహీరాబాద్, సెప్టెంబర్ 19 ప్రజాబలం ప్రతినిధి:** రంజోల్ ప్రధాన రహదారి స్వల్ప వర్షానికే జలమయమవుతోంది. వర్షపు నీరు రోడ్డుపై భారీగా నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతోపాటు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని బీజేపీ జహీరాబాద్ టౌన్-2 అధ్యక్షుడు రమేష్‌రెడ్డి బసంతపూర్ అన్నారు. సమస్యకు తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. రంజోల్ వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, అందుకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడం లేదన్నారు. ప్రధాన రహదారిపై శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి, రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు. రంజోల్ నుంచి వచ్చే ఆదాయానికి అనుగుణంగా ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించాలని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రమేష్‌రెడ్డి కోరారు.

## హుస్సేన్ సాగర్ నిమజ్జనానికి బయలుదేరిన వినాయకుడు



అల్వాల్‌శ్రీ లో శ్రీ లక్ష్మీ గణపతి అసోసియేషన్ గణేష్ మండపంలో నిర్మించిన విఘ్నేశ్వరుడు ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథి గా అల్వాల్ అరె కటిక సంగం ఉపాధ్యక్షులు కడిగే కార్ రాము జీ, గోగిగర్ సాయికుమార్, ఆరెకటిక సంఘం మహిళా అధ్యక్షురాలు కే లక్ష్మి, కె రియాన్షిక, యూత్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్ భార్గవ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు

### ఆ రెల్లి కిరణ్ మరిన్ని పదవులు అధిరోహించాలి.

కమాన్ పూర్ మరి నీ పదవులు అధిరోహించాలి అని కమాన్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ అన్వర్, కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ అన్నారు.కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యదర్శిగా నియమితులైన ఆ రెల్లి కిరణ్ ను కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్ మరియు గుండారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిడుగు శంకర ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల, జిల్లా, ఇన్చార్జీ గా ఉండి మంత్రి శ్రీధర్ బాబు, పీసీసీ ప్రధాన కార్యదర్శి శీను బాబుల ఆదేశాలతో రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు పెట్టెం నవీన్ నియమించారు. కిరణ్ నియామకం పట్ల గుండారం కాంగ్రెస్ పార్టీ నాయకులు వార్డు సభ్యులు దామెర దేవయ్య, వడ్లకొండ వసంత శంకర్, మల్యాల మహేష్,మూదం కొమురయ్య, ముకుంద శ్రవణ్, రాచకొండ శ్రీనివాస్, తదితరులు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# హాస్టళ్లలో నిర్లక్ష్యానికి తావులేదు..

**విద్యార్థుల భద్రత, భోజన నాణ్యతపై ప్రత్యేక నిఘా**
**కలెక్టర్ల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పర్యవేక్షణ..**
**డైట్ అమలులో రాజీ వద్దు**
**విద్యార్థులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకోవాలి**
**అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలపై ఆరా..**
**పారిశుద్ధ్య సిబ్బందికి సముచిత వేతనాలపై ప్రతిపాదనలు**
**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



హైదరాబాద్: సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, నాణ్యమైన ఆహారం, మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, డైట్ అమలు పకడ్బందీగా జరిగేలా నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని స్పష్టం చేశారు.

వసతి గృహాలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలపై జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శనివారం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సీ సంక్షేమ శాఖ పరిధిలోని వసతి గృహాలు, ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ TGSWREIS, ఎస్టీ గురుకుల విద్యాలయాల సంస్థ TGTWREIS ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, అలాగే దివ్యాంగుల సంక్షేమ శాఖ పరిధిలోని వసతి సదుపాయాలపై ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.

వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న భోజనం, డైట్ చార్జీల వినియోగం, నిత్యావసర సరుకుల సరఫరా, వాటి నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్, భవనాల నిర్వహణ, బెడ్డింగ్ తదితర మౌలిక వసతులపై మంత్రి సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ

విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతి సదుపాయం సక్రమంగా అందుతున్నదా లేదా అన్నది క్షేత్రస్థాయిలో నిర్ధారించుకునేలా పర్యవేక్షణ వ్యవస్థ ఉండాలని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో వసతి గృహాలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, సంబంధిత శాఖల అధికారులు కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంత్రి సూచించారు.

తనిఖీలు కేవలం రికార్డుల పరిశీలనకే పరిమితం కాకుండా, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకునేలా ఉండాలని స్పష్టం చేశారు.

**ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి**

విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని మంత్రి స్పష్టం చేశారు. నిర్ణయించిన మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా? నాణ్యమైన బియ్యం, పప్పులు, కూరగాయలు, పాలు, గుడ్లు, పండ్లు తదితర పోషకాహార పదార్థాలు సక్రమంగా సరఫరా అవుతున్నాయా? వంటశాలల్లో పరిశుభ్రత పాటిస్తున్నారా? అనే అంశాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు.

నిత్యావసర సరుకుల కొనుగోలు, సరఫరా, నిల్వ, వినియోగ ప్రక్రియలను పర్యవేక్షించాలని, నాణ్యతలో లోపాలు గుర్తించిన వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని, అనారోగ్యానికి గురయ్యే వారికి తక్షణ వైద్య సహాయం అందేలా సమీపంలోని ప్రభుత్వ వైద్య కేంద్రాలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

బాలికల వసతి గృహాల్లో పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, శానిటరీ అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విద్యార్థులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని మంత్రి సూచించారు.

**సమస్యల పరిష్కారానికి కలెక్టర్ల సహకారం**

వసతి గృహాల నిర్వహణలో ఆర్థికపరమైన ఇబ్బందులు తలెత్తినప్పుడు విద్యార్థులకు అవసరమైన సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో అందుబాటులో ఉన్న నిధులను నిబంధనల మేరకు వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వంటశాలలు, చిన్నపాటి మరమ్మతులు తదితర అత్యవసర సమస్యలను వెంటనే పరిష్కరించేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు.

విద్యార్థులకు అందాల్సిన యూనిఫాంలు, పుస్తకాలు, నోట్‌బుక్స్, బెడ్డింగ్, ఇతర అవసరమైన సామగ్రి సకాలంలో చేరేలా చూడాలని, సరఫరాలో జాప్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

**సిబ్బంది వేతనాలపై ఆరా**

వసతి గృహాలు, గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఎంతమంది ఉన్నారు? వారికి ప్రతి నెలా వేతనాలు సకాలంలో అందుతున్నాయా? వేతనాల చెల్లింపులో ఎక్కడైనా జాప్యం జరుగుతోందా? అనే వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

వేతనాల చెల్లింపులో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

పారిశుద్ధ్య సిబ్బందికి తక్కువ వేతనాలు అందుతున్నాయంటూ వస్తున్న ఫిర్యాదులపై కూడా మంత్రి ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతలో పారిశుద్ధ్య సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి సముచితమైన వేతనాలు అందించే అంశాన్ని పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**భద్రతపై ప్రత్యేక పర్యవేక్షణ**

వసతి గృహాల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. భవనాల స్థితిగతులు, విద్యుత్ వైరింగ్, అగ్నిమాపక భద్రత, తాగునీటి వసతులు, మరుగుదొడ్లు, వంటశాలలు తదితర అంశాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని ఆదేశించారు. విద్యార్థుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి, వాటి పరిష్కారానికి స్పష్టమైన బాధ్యతను సంబంధిత అధికారులకు అప్పగించాలని సూచించారు.

విద్యార్థుల విద్యా పురోగతిని కూడా నిరంతరం పర్యవేక్షించాలని, విద్యలో వెనుకబడుతున్న వారిని గుర్తించి ప్రత్యేక బోధన, కౌన్సెలింగ్, అవసరమైన విద్యా సహాయాన్ని అందించాలని మంత్రి పేర్కొన్నారు.

విద్యతోపాటు క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసానికి కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**దివ్యాంగుల సంక్షేమంపై సమీక్ష**

అనంతరం దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఆ శాఖ పరిధిలోని వసతి సదుపాయాలు, విద్యార్థులకు అందుతున్న సేవలు, మౌలిక వసతులు, సిబ్బంది, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సహాయక పరికరాలు, అనుకూల వసతులు, ఇతర సదుపాయాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సంక్షేమ సంస్థల్లోని ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు పూర్తిస్థాయిలో చేరేలా పర్యవేక్షణ, జవాబుదారీతనం, తక్షణ పరిష్కారం అనే విధానంతో అధికారులు పనిచేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి శృతి ఓజా, ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్ (ఎఫ్ఏసీ) శ్రీధర్, టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి సీతాలక్ష్మి, టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి (ఎఫ్ఏసీ) శ్రీమతి కంభంపాటి శారద, ఎస్సీ అభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు, ఓఎస్డీ వై.జె. విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్‌లో మైత్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఘనంగా మహా అన్నప్రసాద వితరణ



**మహబూబాబాద్, సెప్టెంబర్ 19, ప్రజాబలం**గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మైత్రి హాస్పిటల్లో డాక్టర్ బాలు నాయక్, డాక్టర్ సుచిత్రల ఆధ్వర్యంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. గత ఐదు రోజులుగా స్వామివారికి నిత్య పూజలు జరిపిన నిర్వాహకులు, నిమజ్జనోత్సవం సందర్భంగా మైత్రి హాస్పిటల్ ఆవరణలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.?ఈ సందర్భంగా డాక్టర్ బాలు



నాయక్, డాక్టర్ సుచిత్ర దంపతులు మాట్లాడుతూ---గణనాథుని దివ్య ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతినే పూజించాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల జరిగే కాలుష్యాన్ని అరికట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి ఏటా తమ హాస్పిటల్ నందు మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.?ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ వీరన్న, డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ రమేష్, డాక్టర్ జగన్మోహన్ రెడ్డి, డాక్టర్ రాంరెడ్డిలతో పాటు మైత్రి హాస్పిటల్ సిబ్బంది, స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యుపిఎస్ పంచలింగాల్ పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ లో పాల్గొన మండల విద్యాధికారి అశోక్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 19(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలంఎం పి యు పి ఎస్ పంచలింగాల్ పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు కేశవులు సార్ అధ్యక్షతన నిర్వహించిన పేరెంట్ టీచర్ మీటింగ్ కు గౌరవ మండల విద్యాధికారి శ్రీ అశోక్ సార్ గారు హాజరై విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడడం జరిగింది. తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ సాయంత్రం విద్యార్థులకు సమయం కేటాయించి వారి చదువుపై దృష్టి కేంద్రీకరించాల్సిందిగా సూచించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులు సార్ మాట్లాడుతూ విద్యార్థులను రెగ్యులర్గా పాఠశాలకు పంపాల్సిందిగా విద్యార్థుల తల్లిదండ్రులను కోరడం జరిగింది. ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు నవీన టీచర్, మల్లేశం సార్, బాలమణి టీచర్, దివ్య టీచర్, మరియు సి ఆర్ పి మల్లేశం సార్ పాల్గొనడం జరిగింది. అదేవిధంగా జెడ్ పి హెచ్ ఎస్ ఘనపూర్ పాఠశాలలో నిర్వహించినటువంటి పేరెంట్ టీచర్ మీటింగ్ కూడా గౌరవ మండల విద్యాధికారి అశోక్ సార్ హాజరు కావడం జరిగింది.

### ఒంగోలు నగరంలో మెగా సిగ్రిగేషన్ డ్రైవ్

ఒంగోలు సమగ్ర చెత్త నిర్వహణ ద్వారా నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దవచ్చని ప్రకాశం జిల్లా కలెక్టర్, ఒంగోలు నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి పి.రాజబాబు అన్నారు. ఒంగోలు నగరపాలక సంస్థ ఏర్పాటై 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలలో భాగంగా ఒంగోలు నగరంలో మెగా సిగ్రిగేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా, నగరంలోని 81 వేలకు పైగా ఉన్న నివాస గృహాల నుంచి తడి చెత్త, పొడి చెత్తను ఏకకాలంలో సేకరించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పాల్గొని ప్రజలకు తడి చెత్త పొడి చెత్త విడివిడిగా ఇవ్వటం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు.

# పౌష్టికాహారం పై విద్యార్థులకు అవగాహన..



**నిజాంపేట్ మండల ప్రజాబలం ప్రతినిధి యెదుగని అంజయ్య :** నిజాంపేట మండల కేంద్రంలోని పీఎం శ్రీ హైస్కూల్ లో శనివారం జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మి చేపట్టారు.ఈ సందర్భంగా ఆమె కిశోర బాలికలకు పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కిశోర బాలికలు పోషకాహార లోపానికి గురికాకుండా సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు,పాలు, పండ్లు తదితర పౌష్టికాహార పదార్థాలను తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని వివరించారు. అనంతరం పోషణ అభియాన్‌పై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానమాల, ఉపాధ్యాయులు మహేందర్, రవీందర్, శ్రీనివాస్ చారి, వెంకటస్వామి,వందన, శ్వేత,శిరీష,సుచరిత, అంగన్వాడీ టీచర్లు దుర్గేశ్వరి,అరుణ,రేణుక, మణెమ్మ,మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి..

**నిజాంపేట్ మండల ప్రజాబలం ప్రతినిధి యెదుగని అంజయ్య :** నిజాంపేటకు చెందిన నాలం రాజగౌడ్ (71) రాత్రి 8:30 గంటల సమయంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎదురుగా యూటర్న్ వద్ద సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా, రామాయంపేట వైపు నుంచి సిద్దిపేట వైపు వెళుతున్న TG-27-9338 షిఫ్ట్ కారు వేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన రాజగౌడ్‌ను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుని శ్రీమతి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ASI శ్రీనివాస్ తెలిపారు.

# ఉపాధ్యాయ తల్లిదండ్రుల సమావేశం..



**నిజాంపేట్ మండల ప్రజాబలం ప్రతినిధి యెదుగని అంజయ్య :** నిజాంపేట మండల కేంద్రంలోని పీఎం శ్రీ హైస్కూల్‌లో శనివారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానమాల మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో నైపుణ్యం సాధించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఇంటి వద్ద పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచి చదువుపై దృష్టి సారించేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని తెలిపారు.

# ప్రభుత్వ ఆదేశాలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవు మర్పల్లి ఎస్సై రావుప్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 19 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి పెద్దలకు యువకులకు ప్రజలకు గణేష్ నిమజ్జనం సందర్భంగా గౌరవ సుప్రీమ్ కోర్టు ఆదేశాల మేరకు డీజే వినియోగానికి అనుమతి లేదు. గణేష్ నిమజ్జనం కార్యక్రమం సందర్భంగా మర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో డీజే సౌండ్ సిస్టంవినియోగానికి ఎటువంటి అనుమతి ఇవ్వబడదు. ప్రజల శాంతి భద్రతలు మరియు శాంతియుత వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని డిజె ఆపరేటర్ లు అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించడం లేదా పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించడం జరిగితే, సంబంధిత వ్యక్తులు అయిన ఆర్గనైజర్ మరియు డీజే యజమానిఆపరేటర్ పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయి.డీజే సౌండ్ సిస్టమ్ వలన ప్రజల యొక్క ఆరోగ్య సమస్యలు తలఎత్తి రీసెంట్ గా ఆంధ్రా ప్రదేశ్ లో ఇద్దరు వ్యక్తులు చనిపోవడం జరిగింది.

# గణేష్ నవరాత్రుల పూజా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గణేష్ నేత





**శేర్లింగంపల్లి ( ప్రజాబలం ప్రతినిధి నరేష్) సెప్టెంబర్ 19** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్, జయశంకర్ కాలనీ, పీజేఆర్ నగర్, పంచమి కాలనీ, ఆల్విన్ కాలనీ, తులసి నగర్ తదితర ప్రాంతాల్లో నెలకొల్పిన వినాయక మండపాల్లో విఘ్నేశ్వరుని పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.ఈ పూజా కార్యక్రమాల్లో, అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా గణేష్ మాట్లాడుతూ.. ఆల్విన్ డివిజన్ పరిధిలోని వివిధ వినాయక మండపాల్లో పూజా కార్యక్రమాలకు విశిష్ట అతిథిగా ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ గణేష్ నవరాత్రుల సందర్భంగా ప్రతి కాలనీలో కులమతాలకు అతీతంగా అందరూ ఐక్యమత్యంతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు మనందరిపై ఉండాలని మనసారా కోరుకుంటున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగభూషణం, యాదగిరి, లాలం అరుణ్, సందీప్, శ్రీనివాస్, కిట్టు తదితరులతో పాటు కాలనీ కమిటీ సభ్యులు, వినాయక మండపాల ఆర్గనైజర్లు, భక్తులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# హైదర్ నగర్ లో రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీ



**శేర్లింగంపల్లి( ప్రజాబలం ప్రతినిధి నరేష్) సెప్టెంబర్ 19** హైదర్ నగర్ లోని ఫెయిర్ ప్రైస్ షాప్ నెం. 338408 వద్ద శనివారం మధ్యాహ్నం రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను స్థానిక నాయకులు అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇటీవల రేషన్ కార్డులను స్మార్ట్ కార్డులుగా మార్చి అందిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ హబీబ్ భాయ్, కాబోయే కార్పొరేటర్ పోతుల రాజేందర్, హైదర్ నగర్, రామ్ నరేష్ నగర్ స్థానిక నాయకులు రేషన్ షాప్ వద్దకు వచ్చి కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా షేక్ హబీబ్, పోతుల రాజేందర్ మాట్లాడుతూ.. గతంలో సంవత్సరాలు పాలించిన టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క కార్డు కూడా ఇచ్చిన దాఖలాలు లేవని, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం దశలవారీగా హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నారని తెలిపారు.ఈ స్మార్ట్ కార్డు చిన్న సైజులో పాన్ కార్డు మాదిరిగా ఉంటుందని, షాప్ కు వెళ్లే ముందు కార్డును తీసుకెళ్తే దుకాణదారుడు స్కాన్ చేయగానే కుటుంబ సభ్యుల వివరాలన్నీ కనిపిస్తాయని, ఇది చాలా సులభంగా ఉంటుందని వివరించారు.స్మార్ట్ కార్డు అందని నిరుపేద కుటుంబాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్థానిక నాయకులకు రేషన్ డీలర్ కు వివరాలు అందించినట్లయితే తప్పనిసరిగా కార్డు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# మైసమ్మ అమ్మవారి ప్రాంగణంలో గణేష్ లడ్డూ వేలం - రూ. 1,09,000కు దక్కించుకున్న అశోక్ - లక్ష్మీ దంపతులు



**శేర్లింగంపల్లి (ప్రజాబలం ప్రతినిధి నరేష్) సెప్టెంబర్ 19** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని హైదర్ నగర్ జాతీయ రహదారి పక్కన గల మైసమ్మ అమ్మవారి (జయదుర్గ అమ్మ) ఆలయ ప్రాంగణంలో శుక్రవారం శ్రీ గణపతి స్వామి వారి లడ్డూను బహిరంగ వేలం వేశారు.హైదర్ నగర్ గ్రామం, రామ్ నరేష్ నగర్ కాలనీ వాస్తవ్యులైన శ్రీ యు. అశోక్, లక్ష్మీ దంపతులు ఈ వేలంలో పాల్గొని రూ. 1,09,000/-లకు వినాయకుడి లడ్డూను కైవసం చేసుకున్నారు.

ఆలయ పూరోహితులు నవీన్ కుమార్ స్వామి, చంద్రశేఖర్ స్వామిలు వేలం పాట నిర్వహించారని తెలిపారు. లడ్డూను దక్కించుకున్న అశోక్ దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు శ్రీ అమ్మవారి, స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మైసమ్మ జయదుర్గ ప్రధాన అర్చకులు మీడియాకు తెలిపారు.లక్షా తొమ్మిది వేల రూపాయలకు పలికిన ఈ లడ్డూ గత ఏడాది కంటే అధిక ధర పలకడం విశేషమని పలువురు భక్తులు అభిప్రాయపడుతున్నారు.

# వినీత్ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

## ఇది హత్యేనని తల్లిదండ్రుల ఆరోపణ.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ డిమాండ్





**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 19:** బొడ్డు వినీత్ (28) మృతి ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కందికట్ల విజయ్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దురిగంటి అంజయ్య మాదిగ డిమాండ్ చేశారు. వినీత్ మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని, ఇది ఆత్మహత్య కాదని అతడి తల్లిదండ్రులు ఆరోపించారు.

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం సత్తుపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద వినీత్ తల్లిదండ్రులు బొడ్డు సుబ్బారావు, బొడ్డు సునీలతో కలిసి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆగస్టు 13వ తేదీ తెల్లవారుజామున సత్తుపల్లి పట్టణంలోని రఘురాం ఆస్పత్రి ఎదుట బిల్డింగ్ వద్ద జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలని కోరారు.

వినీత్ మృతిని హత్యగా భావిస్తున్నామని, ఘటనకు సంబంధించి అసత్య ఆరోపణలతో కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని వారు ఆరోపించారు. ఘటన జరిగి దాదాపు 40 రోజులు గడిచినా కేసులో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న అరవింద్, సుధీర్, జ్యోతిలను విచారించి, దర్యాప్తులో నేరం రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇప్పటికే జిల్లా పోలీసు ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం అందించామని నాయకులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలున్నప్పటికీ స్థానిక స్థాయిలో దర్యాప్తు విషయంలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ఈ కేసులో ప్రత్యేకంగా జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

తక్షణ న్యాయం జరగకపోతే ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్‌ను కలిసి తమ ఆవేదనను తెలియజేస్తామని, అవసరమైతే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయిస్తామని తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగని పక్షంలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.వినీత్ మృతికి సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరిపి, తమకు న్యాయం చేయాలని అతడి తల్లిదండ్రులు బొడ్డు సుబ్బారావు, బొడ్డు సునీల కోరారు.

ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కొలికపోగు వెంకటేశ్వరరావు, నియోజకవర్గ నాయకుడు గొల్లమందల ముత్తారావు, నాయకులు తడికమళ్ల దాసు, ఏపీ రాష్ట్ర నాయకులు అద్దేపల్లి సాగర్, సొరగుడి రాజేష్, గంధం పాండు, నందిగామ అఖిల్, అభిపాల్‌తో పాటు బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com